పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 713 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ గురువారం 10.09.2026 పేజీలు : 8 వెల : 4/-



## 53 రోజులు జైల్లో చంద్రబాబు..

### 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

- చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి మూడేళ్లు పూర్తి
- 'నిజం గెలిచింది' నినాదంతో నిరసన తెలిపిన నారా లోకేశ్
- 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగింపు
- జగన్ కుట్రపూరితంగా తప్పుడు కేసు పెట్టారని లోకేశ్ ఆరోపణ
- ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్

2లో

## నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ,

# నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు: సీఎం ట్వీట్

### మూడేళ్ల క్రితం తన అరెస్టును గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో నిజం గెలిచిందన్న టీడీపీ అధినేత
- రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాల నిర్వహణ
- తెలుగు జాతిని నంబర్ 1 చేయడమే తన లక్ష్యమని పునరుద్ఘాటన



"ప్రజల కోసం నిలబడితే ప్రజలు మన వెంట నిలబడతారు, నిజం కోసం నిలబడితే నిజమే మనల్ని నిలబెడుతుంది. ఇదే నా నమ్మకం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు అన్నారు. మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను అరెస్టు చేసిన ఘటనను గుర్తు చేసుకుంటూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనాటి పరిణామం తనలో విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ తప్పు చేయని తనను కుట్రపూరితంగా అరెస్టు చేసి, 53 రోజుల పాటు జైల్లో నిర్బంధించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు, లొంగిపోలేదు. దీనికి కారణం నాకు లభించిన ప్రజా మద్దతు" అని ఆయన తెలిపారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కోసం నిలబడిన తెలుగు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు చూపిన సంఘీభావం తన జీవితంలో మరువలేనిదని అన్నారు. తనను నిర్బంధించినా, దేశ విదేశాల్లో తన కోసం ప్రజలు ఎత్తిన గొంతును నొక్కలేకపోయారని చంద్రబాబు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతును మరింత బలంగా చాటారని చంద్రబాబు అన్నారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి, నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. ఆనాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల కోసం మరింత కష్టపడాలనే సంకల్పాన్ని బలపరిచిందని వివరించారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరి సహకారంతో తెలుగు జాతిని నంబర్ 1 చేయాలనే తన కలను నిజం చేసి తీరుతానని చంద్రబాబు మాట ఇచ్చారు.

## ఐరాస వార్షిక భేటీలో ప్రసంగానికి

# నెతన్యాహు సుడిగాలి పర్యటన



- రాయబారి స్పష్టత: భద్రతా కారణాల దృష్ట్యా ఇంతకుమించి వేరే మార్గం లేదన్న ఐరాస రాయబారి డానీ డానన్.
- అరెస్టు డిమాండ్ తిరస్కరణ: నెతన్యాహును 'యుద్ధ నేరస్థుడు'గా పేర్కొంటూ న్యూయార్క్ మేయర్ చేసిన అరెస్టు డిమాండ్ వెనక్కి.
- నిరసనల ముప్పు: న్యూయార్క్ వీధుల్లో నిరసనలు జరిగే అవకాశం.
- డానన్ ధీమా: గత ఏడాదితో పోలిస్తే ఈసారి సభలో పరిస్థితి భిన్నంగా ఉంటుందని ప్రకటన.

2లో

## అంతరిక్ష యాత్రలకు

# అంతర్జాతీయ సహకారం కీలకం

- అంతర్జాతీయ సహకారం: భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు దేశాల ఉమ్మడి సహకారం, AI, రోబోటిక్స్ కలయిక ఎంతో కీలకమని సునీతా విలియమ్స్ స్పష్టం.
- వాణిజ్య స్పేస్ స్టేషన్: వచ్చే ఏడాది 'హేవన్-1' పేరుతో మొట్టమొదటి వాణిజ్య అంతరిక్ష కేంద్రాన్ని ప్రయోగించనున్నట్లు 'వాస్ట్ స్పేస్' వెల్లడి.
- భారత అంతరిక్ష కేంద్రం: సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు మరిన్ని ఆధునిక సాంకేతికతలు అవసరం : గగన్‌యాన్ వ్యోమగామి అంగద్ ప్రతాప్



2లో



## మసూద్ అజర్

# మా దేశంలో లేడు

- మసూద్ అజర్: తమ దేశంలో లేడని పాక్ ఆరోపణలను తిరస్కరించిన తాలిబన్లు.
- పాక్ వాదన: ఎఫ్‌ఏటీఎఫ్ (FATF) ఒత్తిడితో అజర్ అఫ్ఘాన్‌కు పారిపోయాడని ఆరోపణ.
- భారత్‌లో వాంటెడ్: పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడుల్లో ప్రధాన నిందితుడు.
- విద్యార్థుల బహిష్కరణ: అఫ్ఘాన్ వైద్య విద్యార్థుల బహిష్కరణకు, కొత్త ప్రవేశాల నిలిపివేతకు పాక్ ఆదేశం.

2లో



## సర్‌కు ముందే

# 11 లక్షల ఓట్ల తొలగింపు!

- ఢిల్లీలో ఓటుహక్కుపై భారీ కోత
- 70 నియోజకవర్గాల్లో 68 చోట్ల గెలుపు మెజారిటీ
- కంటే అధికంగా ఓటర్ల తొలగింపు
- 'సర్' ప్రారంభానికి కొద్ది నెలల ముందే
- అసాధారణంగా పెరిగిన డిలీషన్లు
- ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ప్రశ్నలు
- ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్ర అంటూ
- వెల్లువెత్తుతున్న విమర్శలు

2లో

# కలిసి పనిచేద్దాం

- శ్రీలంకలో రాజ్‌నాథ్ సింగ్
- పర్యటన ప్రాధాన్యత: గత 40 ఏళ్లలో భారత రక్షణ మంత్రి శ్రీలంకలో పర్యటించడం ఇదే మొదటిసారి; 3 రోజుల పర్యటన నిమిత్తం కొలంబో చేరుకున్నరాజ్‌నాథ్ సింగ్
- ద్వైపాక్షిక భేటీ: శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేతో రాజ్‌నాథ్ సింగ్ సమావేశమై ప్రాంతీయ శాంతి, భద్రత, సహకారంపై చర్చ.
- బెయిలీ బ్రిడ్జిల ప్రారంభం: భారత రక్షణ మంత్రిత్వ శాఖ శ్రీలంకలో నిర్మించిన 3 బెయిలీ బ్రిడ్జిలను ఇరు దేశాల నేతలు వర్చువల్‌గా ప్రారంభం



2లో

## శాంటాక్లాజ్‌గా మారిన ట్రంప్..

# సిబ్బందికి భారీగా గిఫ్ట్‌లు

- గిఫ్ట్‌లు: ట్రంప్ తన నలుగురు సన్నిహిత సిబ్బందికి క్రిస్మస్ బహుమతులు
- నటాలీ హార్ప్: $45,000 (సుమారు ₹42 లక్షలు).
- మార్గో మార్టిన్: $45,000 (సుమారు ₹42 లక్షలు).
- ఛాంబర్‌లైన్ హారిస్: $45,000 (సుమారు ₹42 లక్షలు).
- వాల్ట్ నౌటా: $20,000 (సుమారు ₹18.5 లక్షలు).
- నిబంధనలు: ఇవి వ్యక్తిగత కానుకలేనని, నైతిక నిబంధనలకు లోబడే ఉన్నాయని వైట్‌హౌస్ స్పష్టం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) తన సిబ్బందికి 45,000 డాలర్ల (సుమారు రూ.42 లక్షల) విలువైన గిఫ్ట్‌లు ఇచ్చారు. క్రిస్మస్ సమయంలో శాంటాక్లాజ్ బహుమతులు ఇచ్చినట్లుగా.. ట్రంప్ తన సన్నిహిత సిబ్బందిని ఆశ్చర్యపరిచారు. శ్వేత సౌధంలో తనకు సహకరించే నలుగురు సిబ్బందికి ఈ బహుమతులు ఇచ్చినట్లు పరిపాలన విభాగం విడుదల చేసిన ఖర్చుల లెక్కల్లో వెల్లడించారు.

తరువాయి 2లో

# అంతరిక్ష యాత్రలకు అంతర్జాతీయ సహకారం కీలకం

బెంగళూరు, న్యూస్‌టుడే: భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు అంతర్జాతీయ సహకారమే కీలకంగా మారుతుందని భారత సంతతి అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. వివిధ దేశాలకు చెందిన మానవాళిలా కాకుండా.. విశ్వమానవుడి రూపంలో చంద్రుడిపైకి వెళుతుందన్నారు. బెంగళూరులో బుధవారం ప్రారంభమైన తొమ్మిదో 'బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో'లో 'అంతరిక్ష తదుపరి అధ్యాయం.. అన్వేషణ, విజ్ఞానం, ఆవిష్కరణలు' పేరిట నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'ప్రతిష్ఠాత్మక అంతరిక్ష యాత్రలకు వివిధ దేశాలు సిద్ధమవుతున్న తరుణంలో సమస్యల పరిష్కారాలకు ఒకరి విధానాల నుంచి మరొకరు ప్రయోజనం పొందొచ్చు. అప్పుడే మన మాడ్యూల్స్, స్పేస్‌సూట్లు, ప్రయోగాలను పోల్చి చూసుకోవచ్చు. భవిష్యత్తు అంతరిక్ష కేంద్రాలు మరింత స్వయం సమృద్ధిగా మారాలి. అంతరిక్షంలో కూడా డేటాబేస్ అవసరం. రోబోటిక్స్, ఏఐ, మనిషి కలిసి పనిచేయవలసిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. అంతరిక్షంలో 608 రోజులు గడిపిన తాను, పైనుంచి భూమిని చూస్తూ 'ఉపాధ్యాయులు చెప్పింది నిజమే. ఇది గుండ్రంగా ఉంది. చదునుగా లేదు' అని అనుకున్నానని సునీతా విలియమ్స్ చెప్పడంతో సభలో నవ్వులు పూశాయి. 'వాస్ట్ స్పేస్ క్రూ పార్ట్‌నర్‌షిప్స్' సంస్థ ఉపాధ్యక్షుడు టామ్ షెల్లీ ప్రసంగిస్తూ.. ఐదేళ్ల క్రితం నెలకొల్పిన తమ కంపెనీ వచ్చే ఏడాది ప్రయోగించనున్న మొదటి వాణిజ్య అంతరిక్ష కేంద్రం హేవన్ 1ను నిర్మిస్తోందన్నారు. దీనికోసం పలు దేశాలు భారీగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. గగన్‌యాన్ మిషన్‌కు ఎంపికైన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్ మాట్లాడుతూ.. భారతీయ అంతరిక్ష కేంద్రం కోసం ఇంకా కీలకమైన సాంకేతికతలు అవసరమన్నారు. రవాణా వాహనం, అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్‌ల గురించి ఒకేసారి యోచించవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. భారత్ నుంచే మనిషిని అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ త్వరలో సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## 53 రోజులు జైల్లో చంద్రబాబు..

### 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నిరసన తెలిపారు. 'నిజం గెలిచింది' అనే నినాదంతో ఉండవల్లిలోని తన నివాసంలో 53 కొవ్వొత్తులు వెలిగించి, నాటి ఘటనను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పందిస్తూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున నాటి ముఖ్యమంత్రి జగన్ రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా తప్పుడు కేసు బనాయించి చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేయించారని ఆరోపించారు. ఆ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించారని ఆయన పేర్కొన్నారు. ఆ చీకటి రోజులకు గుర్తుగా, నాటి నిర్బంధాన్ని నిరసిస్తూ 53 కొవ్వొత్తులు వెలిగించినట్లు లోకేశ్ వివరించారు. నాటి సంఘటన ప్రజాస్వామ్యానికే చీకటి రోజు అని, అయితే చివరికి నిజమే గెలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రజల ఆశీర్వాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

## ఐరాస వార్షిక భేటీలో ప్రసంగానికి నెతన్యాహు సుడిగాలి పర్యటన

ఐరాస: ఐక్యరాజ్య సమితిలో ఈ నెల 22 నుంచి జరిగే ప్రపంచ నాయకుల వార్షిక సమావేశంలో ప్రసంగించడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు 24 గంటల సుడిగాలి పర్యటన జరపనున్నట్లు ఐరాసలోని ఆ దేశ రాయబారి డానీ డానన్ తెలిపారు. గాజాపై యుద్ధం చేసినందుకుగాను నెతన్యాహును 'యుద్ధ నేరస్థుడు'గా పేర్కొని, ఆయన అరెస్టుకు న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ డిమాండు చేసినందున ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతకుమించి మరో మార్గం లేదన్నారు. మమ్దానీ రాజకీయాలు చేస్తున్నారని, నెతన్యాహును కస్టడీలోకి తీసుకునే అధికారం న్యూయార్క్ నగరానికి లేనందున ఆయన తన డిమాండును వెనక్కు తీసుకోవలసి వచ్చిందని చెప్పారు. ఇజ్రాయెల్‌ను నిందించడం ద్వారా రాజకీయాలు చేయడం ఈరోజుల్లో ఫ్యాషనుగా మారిపోయిందని డానన్ అన్నారు. ఈ సమావేశాల సందర్భంగా న్యూయార్క్ వీధుల్లో నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గతేడాది ఐరాస సాధారణ సభలో వేదికపై నుంచి ఇజ్రాయెల్ ప్రధాని తన ప్రసంగం ప్రారంభించగానే పెద్దసంఖ్యలో సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ ఏడాది పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుందని తాము భావిస్తున్నట్లు డానన్ వెల్లడించారు.

## మసూద్ అజర్ మా దేశంలో లేడు

దిల్లీ, లాహోర్: జైషే మహమ్మద్ (జేఈఎం) వ్యవస్థాపకుడు మసూద్ అజర్ అఫ్గానిస్థాన్ నుంచి తన ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడని పాకిస్థాన్ పదే పదే చేస్తున్న వాదనలను తాలిబన్ ప్రభుత్వం తోసిపుచ్చింది. అతడు తమ దేశంలో లేడని అఫ్గాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు ధ్రువీకరించారు. తమ భూభాగాన్ని ఇతర ఏ దేశానికి కూడా వ్యతిరేకంగా ఉపయోగించబోమని అఫ్గాన్ పునరుద్ఘాటించింది. ఉగ్రవాద స్థావరాలు, వాటి నాయకత్వంపై కఠినచర్యలు తీసుకోవాలని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) నుంచి ఎదురవుతున్న ఒత్తిడి నేపథ్యంలో అజర్ అఫ్గానిస్థాన్‌కు పారిపోయాడని పాకిస్థాన్ చెబుతోంది. పారిస్ కేంద్రంగా పనిచేసే ఈ అంతర్జాతీయ పర్యవేక్షక సంస్థ తన రాబోయే సర్వసభ్య సమావేశంలో పాక్ ఉగ్రవాద వ్యతిరేక చర్యలను సమీక్షించనుంది. భారత్‌లోనూ 2001 నాటి పార్లమెంటుపై దాడి, 2008 ముంబయి దాడులు, 2016లో పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019 నాటి పుల్వామా బాంబుదాడి వంటి ప్రధాన ఉగ్రదాడుల్లో పాల్గొన్న అజర్ 'వాంటెడ్' జాబితాలో ఉన్నాడు.

*** అఫ్గాన్ వైద్య విద్యార్థుల బహిష్కరణకు పాక్ ఆదేశం**

ఇస్లామాబాద్, కాబూల్ నడుమ సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో అఫ్గానిస్థాన్ వైద్య విద్యార్థులను బహిష్కరించాలని, కొత్త ప్రవేశాలను నిలిపివేయాలని పాకిస్థాన్ తమ దేశవ్యాప్తంగా ఉన్న వైద్య విద్యాసంస్థలను ఆదేశించింది. పాక్ ప్రభుత్వ వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. పాక్‌లో వైద్యవిద్యను అభ్యసిస్తున్న వందలాది అఫ్గాన్ విద్యార్థులపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది.

## కలిసి పనిచేద్దాం

కొలంబో: దక్షిణాసియా ప్రాంతీయ అభివృద్ధికి, శ్రేయస్సుకు సముద్ర మార్గాల భద్రత, స్వేచ్ఛా నౌకాయానం, అంతర్జాతీయ చట్టాలపట్ల గౌరవం కలిగి ఉండటం, అడ్డంకులు లేని సముద్ర వాణిజ్యం అత్యంత ప్రాధాన్యాంశాలుగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. నాగరికతపరంగా కవలలుగా, సన్నిహిత పొరుగు దేశాలుగా, సముద్రయాన భాగస్వాములుగా ఉన్న భారత్, శ్రీలంకలు తమ ప్రాంతంలోని భద్రత, రక్షణ, శాంతి, శ్రేయస్సును పెంపొందించేందుకు కలిసి పని చేయడాన్ని కొనసాగిస్తాయని పునరుద్ఘాటించారు. బుధవారం కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేతో సమావేశం అనంతరం ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యూహాత్మకపరంగా అత్యంత కీలక ప్రదేశంలో శ్రీలంక ఉందని, హిందూ మహా సముద్రంలో రక్షణ కోసం ఇరు దేశాలు మరింతగా కలిసి పని చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా.. శ్రీలంక వైమానిక దళం కోసం ఎల్70 తుపాకుల ఉన్నతీకరణపై, నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ), నేషనల్ డిఫెన్స్ కాలేజీల సహకారంపై ఇరు దేశాల మధ్య 3 కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి. గత 40 ఏళ్లలో భారత రక్షణ మంత్రి శ్రీలంకలో పర్యటించడం ఇదే మొదటిసారి. 3 రోజుల పర్యటన కోసం మంగళవారం శ్రీలంకలోని కొలంబో చేరుకున్న రక్షణ మంత్రి బుధవారం ఆ దేశంలోని పలు సమావేశాల్లో పాల్గొన్నారు. ఇరు దేశాల నేతలు.. భారత రక్షణ మంత్రిత్వశాఖ శ్రీలంకలో నిర్మించిన 3 బెయిలీ బ్రిడ్జిలను వర్చువల్‌గా ప్రారంభించారు. రాజ్‌నాథ్ సింగ్ కొలంబోలోని భారతీయ శాంతి పరిరక్షక దళం (ఐపీకేఎఫ్) స్మారకాన్ని సందర్శించి, విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన భారత సైనికులకు నివాళులర్పించారు. తర్వాత శ్రీలంక రక్షణశాఖ కార్యాలయాన్ని సందర్శించి ఆ దేశ ఉన్నత స్థాయి నాయకత్వంతో సమావేశమయ్యారు.

## శాంటాక్లాజ్‌గా మారిన ట్రంప్.. సిబ్బందికి భారీగా గిఫ్ట్‌లు

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సిబ్బందికి 45,000 డాలర్ల (సుమారు రూ.42 లక్షల) విలువైన గిఫ్ట్‌లు ఇచ్చారు. క్రిస్మస్ సమయంలో శాంటాక్లాజ్ బహుమతులు ఇచ్చినట్లుగా.. ట్రంప్ తన సన్నిహిత సిబ్బందిని ఆశ్చర్యపరిచారు. శ్వేత సౌధంలో తనకు సహకరించే నలుగురు సిబ్బందికి ఈ బహుమతులు ఇచ్చినట్లు పరిపాలన విభాగం విడుదల చేసిన ఖర్చుల లెక్కల్లో వెల్లడించారు. నివేదికల ప్రకారం.. ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ నటాలీ హార్ప్, కమ్యూనికేషన్స్ అడ్వైజర్ మార్గో మార్టిన్, ఓవల్ ఆఫీస్ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఛాంబర్‌లైన్ హారిస్‌కు ట్రంప్ 45,000 డాలర్ల చొప్పున కానుకలు (ఒక్కొక్కరికి) ఇచ్చారు. ఓవల్ ఆఫీస్ ఆపరేషన్స్ డైరెక్టర్ వాల్ట్ నౌటాకు 20,000 డాలర్ల విలువైన గిఫ్ట్ అందించారు. ఆ ఉద్యోగులకు ట్రంప్ ఇచ్చిన బహుమతులు వారి ప్రభుత్వ విధులకు సంబంధించినవి కావని.. నైతిక ప్రమాణాల ప్రకారం అవి పూర్తిగా అనుమతించదగినవని వైట్ హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## సర్‌కు ముందే 11 లక్షల ఓట్ల తొలగింపు!

ఢిల్లీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రారంభానికి ముందే ఏకంగా 11 లక్షల మందికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగించబడటం తీవ్ర కలకలం రేపుతోంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో 70 నియోజకవర్గాల్లో 68 చోట్ల గెలుపు మెజారిటీ కంటే తొలగించిన ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో ప్రజల ఓటుహక్కును హరించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. న్యూఢిల్లీ : ఢిల్లీలో సర్ ప్రారంభానికి ముందే 11 లక్షల మందికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగించబడినట్టు తాజా నివేదిక వెల్లడించింది. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 68 చోట్ల తొలగించిన ఓటర్ల సంఖ్య గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన గెలుపు మెజారిటీ కంటే అధికంగా ఉంది. ఈ పరిణామాలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఓటర్ అధికార్ మంచ్ నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) విడుదల చేసిన రికార్డులతో పాటు సబర్ ఇన్‌స్టిట్యూట్ గణాంకాలను ఆధారంగా చేసుకుని ఈ అధ్యయనం చేపట్టారు. ఈ నివేదిక ప్రకారం.. 2025 జనవరి 31 నాటికి ఢిల్లీలో 1,56,14,000 మంది ఓటర్లు ఉండగా.. 2026 జూన్ 30 నాటికి ఈ సంఖ్య 1,45,10,299కు పడిపోయింది. అంటే సర్ ప్రారంభమయ్యేలోపే 11,03,701 మంది ఓటర్లు జాబితా నుంచి తొలగించబడ్డారు. సాధారణంగా ఓటరు జాబితా సవరణల మధ్య ప్రతి నెలా పేర్ల చేర్పులు, తొలగింపులు జరుగుతుంటాయి. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఈ వివరాలను ఢిల్లీ సీఈఓ విడుదల చేస్తుంటారు. అయితే సర్ ప్రారంభానికి రెండు నుంచి మూడు నెలల ముందు ఓటర్ల తొలగింపు అసాధారణంగా పెరిగిందని నివేదిక పేర్కొంది.

**'ఈసీ సమాధానం చెప్పాలి'**

గతేడాది ఫిబ్రవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం 70 నియోజకవర్గాల్లో నికరంగా 1,00,613 మంది ఓటర్లు పెరిగారు. కానీ ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఏకంగా 11,70,885 మంది ఓటర్లు తగ్గిపోయారు. ముఖ్యంగా ఏప్రిల్‌లోనే 3,39,509 మంది ఓటర్ల పేర్లు తొలగించబడటం గమనార్హం. ఈ సంఖ్య అంతకుముందు ఆరు నెలల సగటు నెలవారీ తొలగింపుల కంటే దాదాపు 20 రెట్లు అధికం. అలాగే గతేడాది జులై నుంచి డిసెంబర్ వరకు జరిగిన మొత్తం ఓటర్ల తొలగింపుల కంటే ఇది మూడు రెట్లకు పైగా ఉండటం గమనార్హం. ఒక్కసారిగా ఇంత భారీ స్థాయిలో ఓటర్ల పేర్లు ఎందుకు తొలగించాల్సి వచ్చిందనే ప్రశ్నకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజాస్వామ్య వాదులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పది కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటర్ల తొలగింపు రేటు 40 శాతానికి మించి ఉన్నట్టు అధ్యయనం గుర్తించింది.

*** ప్రజాస్వామ్యానికి ప్రమాదం : యోగేంద్ర యాదవ్**

సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేశారు. సర్ ప్రక్రియ ముగిసే నాటికి దేశంలో 103 కోట్ల మంది వయోజనులు ఉన్నప్పటికీ, ఓటర్ల సంఖ్య 88 కోట్లకే పరిమితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశంలో 99 కోట్ల మంది వయోజనులు ఉండగా.. 98 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు కోట్లాది మంది వయోజనులు ఓటరు జాబితాలకు దూరమవుతున్న పరిస్థితి ఏర్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది సాధారణంగా జరిగే విషయం కాదు. ముందస్తు ప్రణాళిక లేకుండా, వ్యవస్థ మొత్తం ప్రమేయం లేకుండా ఇంత భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపు జరగదు. ముఖ్యంగా సర్ ప్రారంభానికి ముందే జరిగిన భారీ తొలగింపులపై దర్యాప్తు జరగాలి. ఇది నేరపూరిత కుట్రగా విచారించాల్సిన అంశం. ప్రజలను ఓటుహక్కుకు దూరం చేయడమే సర్ లక్ష్యంగా కనిపిస్తోంది" అని యోగేంద్ర యాదవ్ ఆరోపించారు.

**ఆ ఐదు రాష్ట్రాలు...**

సర్ వడో దశ ముసాయిదా ఓటరు జాబితాల్లో అత్యధిక తొలగింపులు జరిగిన ఐదు రాష్ట్రాల్లో గత మూడేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలే ఉన్నాయి. మహారాష్ట్ర, ఏపీలో 2024లో, కర్నాటక, తెలంగాణలో 2023లో, ఢిల్లీలో 2025లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ పరిణామం రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికలు జరిగిన కొద్ది కాలానికే అదే రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపులు వెలుగులోకి రావడం యాదృచ్ఛికమా? లేక ఓటరు జాబితాల నిర్వహణలో తీవ్రమైన లోపాలున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

*** గతేడాది జరిగిన ఢిల్లీ ఎన్నికల సంగతేంటి? : సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్**

సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ కూడా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 1.56 కోట్ల మంది ఓటర్లతో జరిగాయనీ, ఇప్పుడు దాదాపు 91 లక్షల మంది ఓటర్లు తొలగించబడటం లేదా వారికి నోటీసులు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఎన్నికల సంఘమే తన ఓటరు జాబితాలో ఇన్ని తప్పులు ఉన్నాయని చెప్తుంటే.. గతేడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విశ్వసనీయత ఎంత? ప్రజలు ఈ ప్రక్రియను ఎలా నమ్మాలి? ఇన్ని లోపాలు బయటపడితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?" అని ఆమె ప్రశ్నించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన విషయం విదితే.

**ఓటుహక్కుపై పెరుగుతున్న ఆందోళన**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమని గొప్పలు చెప్పుకునే దేశంలో ఓటుహక్కు పరిరక్షణ అత్యంత కీలకమైన అంశం. ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించడం అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు. ఒక పౌరుడి రాజకీయ హక్కును నేరుగా ప్రభావితం చేసే చర్య. అయితే ప్రస్తుతం దేశంలో ఎన్నికల సంఘం స్వతంత్రత, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై ఇప్పటికే అనేక ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో ఢిల్లీలో ఈ భారీ తొలగింపుల అంశం మరింత ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా బీజేపీ పాలనలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో ఎన్నికల సంస్థల స్వతంత్రతపై ప్రతిపక్షాలు, పౌరసంఘాలు పదేపదే సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తాజా గణాంకాలు ఆ అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి.



## సంపాదకీయం

# జలమే జీవనాధారం - పొదుపే మన కర్తవ్యం

ఇంటి పనుల సహాయకురాలు పంపు తిప్పుతుంది. అవకాశం ఉన్నంత నీరు వచ్చే విధంగా తిప్పుతుంది. గిన్నెలను సబ్బుతో తోమేటప్పుడే పంపు తిప్పుతుంది. అవి రుద్ది కడిగేంతవరకు ధారాపాతంగా నీళ్లు పోతూనే ఉంటాయి; పట్టించుకోము. బ్రష్ చేసుకోవడానికి సింకు దగ్గరకు వెళ్లగానే పంపు తిప్పుతాము; బ్రష్ కడగగానే ఆపము. బ్రష్ చేసుకోవడం అయిపోయేంతవరకు నీళ్లు అలా వస్తూనే ఉంటాయి. టాయిలెట్ ఫ్లష్‌కు రెండు రకాల బటన్లు ఉంటాయి అనే మాట మరచిపోతాము. ఇంటి ముందు గచ్చు కడగాలన్నా, కారు కడగాలన్నా కుళాయికి పైపు అమర్చి సరదాగా కడగటం మొదలుపెట్టామంటే, మనం అలసిపోయే వరకు ఆడుకుంటూనే ఉంటాము. నీళ్లంటే మనకు ఉండే సరదా అది! బొమ్మతో ఆడుకోవాలని అనుకుంటే దానిని కొనాలి; నీళ్లను కొననవసరం లేదు. నీటి పన్ను పెద్దగా ఉన్నట్లు అనిపించదు. తాగునీరుకు కొద్దిగా పన్ను కడతాము, కానీ ఇంట్లో ఉండే బోర్ నీళ్లకు విద్యుత్ ఛార్జీలు ఒక్కటే కడతాం కాబట్టి పెద్దగా లెక్కచేయం. గతంలో ఇళ్లలో కుళాయిల సౌకర్యం నగరాలలో మాత్రమే ఉండేది; తరువాత పట్టణాలకు వచ్చింది. ఇప్పుడు పల్లెల్లో కూడా అందరి ఇళ్లలోనూ ఇదే పరిస్థితి. కారు కడుగుతామా, గేదెలను కడుగుతామా అనే తేడా ఒక్కటే. ఇక తాగునీరు కోసం మనం ఉపయోగించే యూవీ / యూఎఫ్ వాటర్ ప్యూరిఫైయర్లను మినహాయిస్తే, సాధారణ ఆర్‌వో ప్యూరిఫైయర్ల నుండి ఒక లీటరు తాగునీరు రావడానికి మూడు లీటర్ల నీరు బయటకు వృథాగా పోతుంది. పల్లెల్లో అయితే మన ఇంటి ముందు నుండి నీళ్లు పక్కింటి ముందుకు కాలువ కట్టినందుకు సిగపట్లు కూడా ఉంటాయి. అన్నీ పొదుపుగా వాడుకుంటాము, కానీ నీళ్ల దగ్గరకు వచ్చేటప్పటికి సరదాగా అనే కంటే విలాసవంతంగా ఖర్చు పెట్టేస్తాము. నీళ్లను మనం పండించేది కాదు, కానీ మనం ఏ పంట పండించాలన్నా నీరు కావాలి. మనిషి కడుపునిండా తినాలంటే నీరు కావాలి; తిన్నాక కూడా నీరు కావాలి. అంటే ప్రాణికోటికి ప్రధానమైన ఆధారం నీరు. భూగర్భంలో దాగి ఉన్న నీటిని వెలికితీయడానికి శాస్త్రం పనికొస్తుంది కానీ, నీటిని పుట్టించే శాస్త్రం ఇప్పటివరకైతే లేదు. ఇంకా చెప్పాలంటే ఆహారానికి ప్రత్యామ్నాయం కొద్దికొద్దిగా కనిపెడుతున్నారు, కానీ నీటికి ప్రత్యామ్నాయం మాత్రం ఇంకా రాలేదనే చెప్పాలి. అటువంటి నీటిని మనం ఎంత నిర్లక్ష్యంగా వాడతామో చెప్పడానికి పైన చెప్పుకున్నవి చిన్న ఉదాహరణలు మాత్రమే. పైన చెప్పినవి చాలా చిన్న విషయాలు. అభివృద్ధి అంటే పరిశ్రమలు అని మనం ఒప్పుకుంటే, ఆ పరిశ్రమలకు అవసరమయ్యే నీటితో పోలిస్తే పైన చెప్పినవి చాలా చిన్నవి. పరిశ్రమలతో మరో చిక్కు కూడా ఉన్నది; అవి నీటిని వాడుకోవడంతో పాటు నీటిని కలుషితం కూడా చేస్తాయి. అది ఈరోజు టాపిక్ కాదు, మరో రోజు చర్చించుకోవచ్చు. నీటిని ఇంత విలాసవంతంగా వాడుకునే కొద్దీ నీటి నిల్వలు తరిగిపోతున్నాయి అని కూడా మనకు తెలుసు. కానీ నీటిని పొదుపు చేయలేని బలహీనతకు బానిసలమయ్యాము. ఎల్ నినో ప్రభావం ప్రపంచాన్ని కుదిపే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ సంవత్సరం భారతదేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నది. ఆగస్టు చివరి నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 40 నుండి 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. 26 జిల్లాలకు గాను 23 జిల్లాల్లో లోటు వర్షపాతం వలన కరువు ఛాయలు, తీవ్రమైన వాతావరణ ఒత్తిడి కనిపిస్తున్నది. తెలంగాణలో సాధారణ వర్షపాతం కంటే 18 శాతం తక్కువ నమోదైంది. జోగులాంబ గద్వాల, నల్గొండ వంటి జిల్లాలలో 70 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇక జలాశయాల విషయానికి వస్తే, ఈ రోజుల్లో గేట్ల ఎత్తివేత వలన పర్యాటకులతో కళకళలాడవలసిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆనకట్టలలో పూర్తి నైరుతి సీజన్ గడిచినా నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోలేదు. కృష్ణా నదీ పరీవాహక జలాశయాల పరిస్థితి ఇలా ఉంటే, గోదావరి పరీవాహక జలాశయాల విషయానికి వస్తే సింగూరు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో సగం నీటి నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక ధవళేశ్వరం బ్యారేజీ నుండి సముద్రంలోకి వదిలే నీటిని తగ్గించారు. సెప్టెంబర్ చివరి వారం నాటికి సాధారణ వర్షా ల వలన కానీ, ఉపరితల ఆవర్తనం వలన వర్షా లు పడితే తప్ప జలాశయాల్లో నీటిమట్టం పెరిగే అవకాశం లేదు. అందువలన రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, సాధారణ ప్రజానీకానికి సూచనలు, విజ్ఞప్తులు చేశాయి. జలాశయాల్లో నీటి మట్టాలు తరిగిపోతుండటం వలన రైతులను వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలు కాకుండా, రబీ/యాసంగి సీజన్లలో ఆరుతడి పంటలైన మినుములు, పెసలు, శనగలు లాంటి పంటలు వేయమని సూచించాయి. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది కాబట్టి పశువుల దాణా, పచ్చిగ్రాసం కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాయి. కానీ వరి పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వటమే కాక ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది కాబట్టి, రైతు తన భద్రతను వదులుకోలేక ప్రభుత్వ సూచనలను పాటించడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జలాశయాలలో ఉన్న నీటిని తాగునీటికి తప్ప సాగునీటికి వదిలే పరిస్థితి లేదు. నీటి విషయంలో ప్రభుత్వ నిస్సహాయతను అర్థం చేసుకోకుండా రైతులు వేసే అడుగులు వారికి నష్టాన్ని చేకూరుస్తాయి. రైతులు ప్రభుత్వాల విజ్ఞప్తిని పాటించాలని అనుకుంటే, ప్రభుత్వాలు ఆరుతడి పంటలకు కూడా మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలి. రైతులతో పాటు సామాన్య ప్రజలకు కూడా ప్రభుత్వాలు కొన్ని విజ్ఞప్తులు చేశాయి. వేసవి నాటికి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ఇళ్లల్లో నీటి వాడకాన్ని పరిమితం చేసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. కానీ ఆ విజ్ఞప్తిని పట్టించుకునే విజ్ఞులు ఎంతమంది ఉన్నారో ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకుంటేనే తెలుస్తుంది. సాధారణంగా మనం ఇల్లు కట్టుకోవడానికి మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేటప్పుడు కుళాయిల సైజును నిర్దేశిస్తాయి. మనం వాటిని కాస్త అటుఇటుగా పెట్టుకున్నా తనిఖీకి ఎవరూ రారు కాబట్టి పెద్దగా పట్టించుకోము. అదే అమెరికాలో ప్రభుత్వం పెట్టిన ఆంక్షలను పాటిస్తారు. కారణం అక్కడ ఇంటికి ప్లంబర్ పని చేయడానికి వచ్చేవారు ఖచ్చితంగా లైసెన్స్ కలిగిన వారై ఉండాలి. ఏ సమస్య వచ్చినా లైసెన్స్ ఉన్నవారే చేయాలి; వారు ఏదైనా పొరపాటు చేస్తే లైసెన్స్ రద్దవుతుంది. ప్రభుత్వాలు కఠినంగా ఉండటం వేరు, మనమే ఆంక్షలను విధించుకోవటం వేరు. ఇది ఎవరికి వారు పాటించాలి. ప్రపంచ జనాభాలో 210 కోట్ల మంది ప్రజలు పరిశుద్ధమైన తాగునీరులేక అల్లాడిపోతున్నారు. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో 27 కోట్ల మంది ప్రజలు తాగునీరు కోసం సుదూర ప్రాంతాలకు నడిచి వెళ్తున్నారు. ప్రపంచంలో నాలుగో వంతు ప్రజలకు లేని అవకాశం మనకు ఉన్నది; మనకు కావలసిన దానికంటే అధికంగా నీరు దొరుకుతున్నది. దాని విలువ తెలుసుకుంటే మన భవిష్యత్తు తరాల కోసం పొదుపు చేస్తాము. విలువ తెలిసి కూడా పొదుపు చేయకపోతే మన భవిష్యత్తు తరాలకు ద్రోహం చేసిన వారమవుతాము. ఇప్పుడు ఎల్ నినో ప్రభావం వలన నీటిని పొదుపు చేయటం అనే దృక్పథంతో కాకుండా, భూగర్భ జలాలను కాపాడుకోవటం మన విధి అనుకుని పొదుపు చేద్దాం. మనకోసం, మన పిల్లలకోసం!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

### సెప్టెంబర్ 10

SEP 10

* 2003: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం
* 1887: భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు గోవింద్ వల్లభ్ పంత్ జననం (మ.1961).
* 1895: కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జననం (మ.1976). (చిత్రంలో)
* 1905: తెలుగు చలనచిత్ర సంగీతదర్శకుడు ఓగిరాల రామచంద్రరావు జననం (మ.1957).
* 1920: గణిత, గణాంక శాస్త్రజ్ఞుడు కల్యంపూడి రాధాకృష్ణ రావు జననం.
* 1921: భారతీయ చిత్రకారుడు వడ్డాది పాపయ్య జననం (మ.1992).
* 1922: భారతదేశ రసాయన శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ జననం.(మ.1985)
* 1985: తెలంగాణా వీరవనిత చాకలి ఐలమ్మ మరణం (జ.1895).
* 1992: దక్షిణ భారత నటి కేథరీన్ థెరీసా జననం.
* 1944: భారత స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ దండు నారాయణ రాజు మరణం. (జ.1889)



విశ్వనాథ సత్యనారాయణ

### తిరుమల నడక మార్గంలో

# మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన

- తిరుమల అలిపిరి నడకమార్గంలో మరోసారి చిరుత సంచారం
- 7వ మైలు వద్ద చిరుతను చూసి భయపడిన భక్తులు
- నరసింహస్వామి ఆలయం సమీపంలోనూ కనిపించినట్లు సమాచారం
- భక్తులను గుంపులుగా మాత్రమే అనుమతిస్తున్న తితిదే
- నడకమార్గంలో భద్రతను పెంచి, నిఘా ఏర్పాటు చేసిన అధికారులు



తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ ఇలాంటి భద్రతా చర్యలనే అమలు చేసింది.

### ఏపీలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు..

# నీట్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు

- 2026-27 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- నీట్-యూజీ 2026 ర్యాంకుల ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ
- సెప్టెంబర్ 9 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



ఆంధ్రప్రదేశ్‌లో బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (Dr. NTRUHS) ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. 202627 విద్యా సంవత్సరానికి గాను నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. నీట్ యూజీ 2026 పరీక్షలో సాధించిన ర్యాంకుల ఆధారంగా ఈ ప్రవేశ ప్రక్రియను నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పష్టం చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైంది. అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఉన్న 100% సీట్లతో పాటు, ప్రైవేట్ మైనారిటీ, నాన్ మైనారిటీ నర్సింగ్ కళాశాలల్లోని కేటగిరీ 'ఏ' కిందకు వచ్చే 60% సీట్లను భర్తీ చేయనున్నారు.

**అర్హతలు, ముఖ్యమైన వివరాలు**

నీట్ యూజీ 2026 పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఈ ప్రవేశాలకు అర్హులు. ఇంటర్మీడియట్ (10+2) లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఓసీ అభ్యర్థులు సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 45% మార్కులు, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 40% మార్కులు పొంది ఉండాలి. వయసు డిసెంబర్ 31, 2026 నాటికి 17 ఏళ్లు పూర్తి కావాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

**దరఖాస్తు ప్రక్రియ, రుసుము**

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ కేటగిరీ అభ్యర్థులు రూ.2,500, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.2,000 దరఖాస్తు రుసుముగా చెల్లించాలి. దరఖాస్తు సమయంలోనే విద్యార్హత, పుట్టిన తేదీ, కులం, నివాసం వంటి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని యూనివర్సిటీ స్పష్టంగా పేర్కొంది. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాతే మెరిట్ జాబితాను విడుదల చేస్తారు.

# ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రలో మూడు రోజులు వర్షాలు

- **ఉత్తరాంధ్రకు వర్ష సూచన.. రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం**
- **పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం**
- **ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఉత్తర బంగాళాఖాతంలో రేపు (గురువారం) అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ మార్పులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ అల్పపీడన ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షం కురుస్తున్నప్పుడు, ముఖ్యంగా ఉరుములు, పిడుగులు పడే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని హెచ్చరించారు. చెట్ల కింద, భారీ హోర్డింగుల వద్ద, శిథిలమైన నిర్మాణాల దగ్గర నిలబడటం ప్రమాదకరమని స్పష్టం చేశారు.

**వివిధ జిల్లాల్లో వర్ష సూచన వివరాలు:** గురువారం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. శుక్రవారం: ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయి. మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి జల్లులు పడొచ్చని అంచనా వేస్తున్నారు. శనివారం: విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని విపత్తుల శాఖ పేర్కొంది. ఈ అల్పపీడన కదలికలను, వాతావరణ మార్పులను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త..

## కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- **దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం**
- **ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్**
- **అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం**
- **మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు**
- **ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం**



రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్ కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 202930 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

### తిరుమల శ్రీవారి సాలకట్ల,

## నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

- **శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు**
- **సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు**
- **ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ**
- **తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు**
- **ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటన**



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖరారు చేసింది. 2026 సంవత్సరానికి గాను సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఇప్పటి నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 15న సీఎం చంద్రబాబు స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పాలకమండలి సభ్యులు బుధవారం తిరుమలలో ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఈ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కూడా బ్రహ్మోత్సవాల వివరాలను పంచుకున్నారు. టీటీడీ ప్రకటనతో శ్రీవారి భక్తుల్లో బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది.

### ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు

## షెడ్యూల్ విడుదల

- **సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన**
- **15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన**
- **19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన**



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలు:**

- సెప్టెంబర్ 11: ఫొటో సహిత ఓటర్ల జాబితాల ప్రదర్శన
- సెప్టెంబర్ 14: పోలింగ్ కేంద్రాల ముసాయిదా (Draft) జాబితా రూపకల్పన
- సెప్టెంబర్ 15: పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ
- సెప్టెంబర్ 15, 16: పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, మార్పులుచేర్పుల వినతుల స్వీకరణ
- సెప్టెంబర్ 16: రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ అధికారుల సమన్వయ సమావేశం
- సెప్టెంబర్ 18: పోలింగ్ స్టేషన్ల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం
- సెప్టెంబర్ 19: ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ.

## తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

- **భక్తుల ప్రమాద బీమా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు**
- **సహజ మరణానికి రూ.2 లక్షల బీమా**
- **బీమా పథకానికి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లింపు**
- **లడ్డూ తయారీకి 400 అదనపు పోస్టులకు ప్రతిపాదనలు**
- **ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్**



శ్రీవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తూ మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని 'తిరుమల తిరుపతి దేవస్థానం' (టీటీడీ) బోర్డు నిర్ణయించింది. సహజ మరణం సంభవించినా రూ.2 లక్షలు అందించేలా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయనుంది. దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది. తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలను వెల్లడించారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. బీమా పథకం అమలుకు టీటీడీ నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్‌ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగం పెంచేందుకు 400 అదనపు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నారు. తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను రూ.2.80 కోట్లతో జీపీఎస్ రెన్యువబుల్స్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి రవాణా ఛార్జీల కోసం మూడేళ్లకు రూ.1.60 కోట్లు కేటాయించారు. నారాయణవనం ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆమోదించిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు.

### ప్రపంచ తెలుగు మహా సభలు..

## బాలబాలికలకు అద్భుత అవకాశం

వచ్చే డిసెంబరు 5, 6వ తేదీల్లో నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఇందుకు వేదిక కానుంది. ఈ సందర్భంగా డా.భానుమతి రామకృష్ణ వేదికపై 16 ఏళ్ల లోపు బాల బాలికలకు 'పాడనా తెలుగు పాట' (కరోకే మాధ్యమం ద్వారా) కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించనున్నామని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా॥గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ప్రాథమిక పరిశీలన, ఎంపిక కరోకే మాధ్యమం ద్వారా రెండు గీతాల్ని రికార్డు చేసి srividyajv8@gmail.com ద్వారా జొన్నలగడ్డ వల్లీ శ్రీవిద్యకు సెప్టెంబరు 30లోగా పంపాలి. ఎంపిక అయిన వారికి అక్టోబరు 15వ తేదీలోగా సమాచారం తెలియజేస్తారు. వారు రెండు సోలో గీతాలు, ఒక యుగళ గీతం పాడాల్సి ఉంటుంది. తెలుగు సాహిత్య, సంగీత విలువలున్న గీతాలు మాత్రమే పాడాలి. అశ్లీల, జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించే గీతాలు పాడటానికి అనుమతి లేదు. ఎంపికైన వారికి రవాణా ఇతర సదుపాయాలు కల్పిస్తారని కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, సమన్వయ కర్తలు డా.కె.మురళీధర్ రెడ్డి, శ్రీ కోగంటి శ్రీకాంత్‌లు తెలిపారు.

## గణేశ్ మంటపాల నిర్వాహకులకు తియ్యని కబురు చెప్పిన మంత్రి నారా లోకేశ్

- **వినాయక మండపాలకు ఉచిత విద్యుత్.. ఏపీ ప్రభుత్వ నిర్ణయం**
- **సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్**
- **నిర్వాహకులపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యమన్న ప్రభుత్వం**
- **కూటమి సర్కార్ నిర్ణయంపై భక్తులు, ఉత్సవ కమిటీల హర్షం**



వినాయక చవితి పండుగ సమీపిస్తున్న వేళ, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు, భక్తులకు ఒక శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రతీ గణేశ్ మంటపానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా తన ప్రకటనను వెల్లడించారు. విద్యుత్ ఛార్జీల భారం లేకుండా, ఉత్సవ కమిటీలు, భక్తులు మరింత ఉత్సాహంగా, వైభవంగా వేడుకలు జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. "ఈ వినాయక చవితికి, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని గణేశ్ మంటపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని ప్రకటించడం సంతోషంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుపుకుంటున్న వారికి మద్దతుగా, వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు మా ప్రభుత్వం ఈ చొరవ తీసుకుంది" అని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఇప్పటివరకు ఉత్సవ కమిటీలు గణేశ్ మండపాల కోసం తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలంటే నిర్ణీత రుసుములు చెల్లించాల్సి వచ్చేది. అనుమతుల కోసం కూడా కొంత శ్రమించాల్సి ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిర్వాహకులకు ఈ ఆర్థిక భారం, ప్రక్రియపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ నిర్ణయం పట్ల ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రతీ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో వర్ధిల్లాలని నారా లోకేశ్ ఆకాంక్షించారు.

## గ్రూప్–1 మూల్యాంకనంలో అవకతవకలు.. హైకోర్టుకు సిట్ నివేదిక

అమరావతి: వైకాపా (YS RCP) హయాంలో చేపట్టిన ఏపీపీఎస్సీ గ్రూప్ 1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై ఏర్పాటైన సిట్ తన తుది నివేదికను హైకోర్టుకు సమర్పించింది. మూల్యాంకనంలో అనధికార వ్యక్తుల జోక్యం ఉందని సిట్ నిర్ధరించింది. పర్యవేక్షణ లోపాలు, గోప్యత ఉల్లంఘనలు జరిగాయని.. విధానపరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని సిట్ తన నివేదికలో పేర్కొంది.



# ఏపీ పర్యాటకానికి కొత్త జోష్.. 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

- **స్కైహోప్ ఏవియేషన్, మె హెయిర్ సంస్థలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
- **ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి రూ. 20 కోట్ల వ్యయం అంచనా**
- **ఉడాన్ పథకం కింద ఆపరేటర్లకు కేంద్రం ఆర్థిక చేయూత**
- **మొదటి దశలో విజయవాడ, విశాఖ, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో సేవలు**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. రాష్ట్రంలోని కీలక పర్యాటక ప్రాంతాలను జల మార్గాల ద్వారా అనుసంధానించే సీ ప్లేన్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు స్కైహోప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలి ఎయిర్ సర్వీసెస్ (మె హెయిర్) సంస్థలు ముందుకు రాగా, కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వాటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాలను గుర్తించారు. విజయవాడ (బెర్మ్ పార్క్), శ్రీశైలం, విశాఖపట్నం, తిరుపతి (రాయలచెరువు), సూర్యలంక, గండికోట, కాకినాడ, అరకు (జోలాపుట్), లంబసింగి (తాజంగి రిజర్వాయర్), పోలవరంలలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్‌డ్రోమ్‌ల (మినీ విమానాశ్రయాలు) నిర్మాణానికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) త్వరలో టెండర్లు పిలవనుంది. ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఆపరేటర్లుగా సంస్థలు ముందుకు రావడంతో, వాటర్‌డ్రోమ్‌ల



నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఆయా సంస్థల ప్రతినిధులు ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. గతేడాది విజయవాడలోని బెర్మ్ పార్కు నుంచి శ్రీశైలం వరకు నిర్వహించిన ట్రయల్ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సీ ప్లేన్‌లో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రయోగం కార్యరూపం దాల్చనుంది. అయితే, అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కాకుండా డిమాండ్‌ను బట్టి దశలవారీగా సేవలను ప్రారంభించనున్నారు. తొలి దశలో విజయవాడ, శ్రీశైలం, విశాఖపట్నం, లంబసింగి, సూర్యలంక, కాకినాడలో సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం 'ఉడాన్' పథకం కింద ఆర్థిక చేయూత అందించనుంది. ప్రయాణికుల నుంచి ఆదరణ పెరిగే వరకు, ఆపరేటర్లకు సంభవించే నష్టాలను భర్తీ చేసేందుకు లోటు భర్తీ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వీజీఎఫ్) కింద తోడ్పాటు అందిస్తుంది. రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో సీ ప్లేన్లకు మంచి ఆదరణ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే కేరళ, గుజరాత్‌లలో ఉడాన్ పథకం కింద సీ ప్లేన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు వాటి సరసన ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. ఈ వాటర్‌డ్రోమ్‌లను కేవలం సీ ప్లేన్లకే కాకుండా, ఇతర పర్యాటక బోట్ల అవసరాలకు కూడా వినియోగించుకునేలా డిజైన్ చేస్తున్నారు.

## జోగి రమేష్ కుటుంబం నుంచి ప్రాణహాని ఉంది: కోడలు మేఘన

* **నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి**
* **గవర్నర్‌కు జోగి రమేష్ కోడలు మేఘన వినతిపత్రం**



అమరావతి: 'మా అత్తమామలు జోగి రమేష్, శకుంతల, నా భర్త రాజీవ్, ఇతర కుటుంబసభ్యుల నుంచి నాకు, నా తల్లిదండ్రులకు ప్రాణహాని ఉంది. మాకు రక్షణ కల్పించండి. నన్ను ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధించినవారిపై వెంటనే చర్యలు తీసుకోండి' అని వైకాపా మాజీమంత్రి జోగి రమేష్ కోడలు మేఘన.. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు. తన తండ్రి అనంతకృష్ణగౌడ్‌తో కలిసి బుధవారం గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందించారు. 'నా తల్లిదండ్రులు నా పెళ్లికి రూ.5 కోట్లు ఖర్చుచేశారు. తర్వాత కొన్నాళ్లకే అత్తమామలు రూ.5కోట్ల అదనపు కట్నం, ఖరీదైన కార్లు, వజ్రాల నక్లెస్, వజ్రపు ఉంగరం తీసుకురావాలని వేధింపులు మొదలుపెట్టారు. గోవాకు వెళ్లినప్పుడు నాకు ఈత రాదని తెలిసినా నా భర్త పడవ పైనుంచి నీటిలోకి నెట్టేయడానికి ప్రయత్నించారు' అని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు. కేసును తెలంగాణకు మార్పించుకోవాలని మేఘనకు సూచించారు.

## సెప్టెంబర్ 9 ఒక చీకటి రోజు.. ఆ కుట్ర వల్లే వైసీపీ పతనం: చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

- **చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తి**
- **ఈ సందర్భంగా వైసీపీపై శాసనమండలి చీఫ్ విప్ విమర్శలు**
- **రాజకీయ కక్షతోనే విజనరీ నేతపై జగన్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని ఆరోపణ**
- **ఆ కష్టకాలంలో లోకేశ్, భువనేశ్వరిల పోరాటం మరువలేనిదన్న అనురాధ**

ఐదు దశాబ్దాల మచ్చలేని రాజకీయ జీవితం గడిపిన చంద్రబాబును నాటి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిన సెప్టెంబర్ 9వ తేదీ తెలుగు ప్రజల చరిత్రలో ఒక చీకటి రోజని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అభివర్ణించారు. ఆ అక్రమ అరెస్టు జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాడు రాజకీయ కక్షతో చంద్రబాబును జైలుకు పంపిన జగన్ కు, ప్రజలు తమ తీర్పుతో గట్టిగా బుద్ధి చెప్పారని, 164 స్థానాల్లో కూటమిని గెలిపించి చంద్రబాబు నాయకత్వానికి పట్టం కట్టారని అన్నారు.

* **రాజకీయ కక్షతోనే కుట్రపూరిత అరెస్ట్**

ఆనాడు నంద్యాలలో పార్టీ కార్యక్రమం కోసం వెళ్లిన చంద్రబాబు బస చేసిన బస్సు తలుపులు అర్ధరాత్రి బాది, ఎలాంటి కారణం లేకుండా తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారని అనురాధ మండిపడ్డారు. జగన్ ఆదేశాలతో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆమె ఆరోపించారు. "31 క్రిమినల్ కేసుల్లో ఉంటూ, రూ.43 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న జగన్.. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, తాను జైలుకు వెళ్లాను కాబట్టి చంద్రబాబును కూడా పంపాలనే కుంచిత బుద్ధితో ఈ కుట్ర చేశారు. అధికారం కోసం కన్నతల్లిని, తోబుట్టువును సైతం రోడ్డున పడేసిన సంస్కృతి వారిది. చంద్రబాబు లాంటి విజనరీకి, జగన్ కు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంది" అని ఆమె దుయ్యబట్టారు.

* **కష్టకాలంలో అండగా నిలిచిన నారా కుటుంబం**

చంద్రబాబు అరెస్టుతో రాష్ట్ర ప్రజలు దిగ్భ్రాంతికి గురైన ఆ క్లిష్ట సమయంలో నారా కుటుంబం చూపిన ధైర్యం మరువలేనిదని అనురాధ కొనియాడారు. తండ్రి అరెస్టు వార్త వినగానే యువనేత నారా లోకేశ్ తన పాదయాత్రను నిలిపివేసి, ఒకవైపు కార్యకర్తలకు ధైర్యం చెబుతూనే ఢిల్లీ స్థాయిలో న్యాయపోరాటం చేశారని గుర్తుచేశారు. మరోవైపు, భువనేశ్వరి, బ్రాహ్మణి గారు చిన్నారి దేవాన్ష్‌ను వదిలి రాజమండ్రికి వచ్చారని, చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించడానికి భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర చేపట్టారని తెలిపారు. 53 రోజుల తర్వాత చంద్రబాబు జైలు నుంచి విడుదలైనప్పుడు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఆ క్షణమే వైసీపీ పతనం ప్రారంభమైందని ఆమె స్పష్టం చేశారు.

* **ప్రజాతీర్పు, న్యాయస్థానం క్లీన్‌చిట్‌తో నిజం గెలిచింది**

వైసీపీ ప్రభుత్వ అరాచకాలను చూసే ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా 11 సీట్లకు పరిమితం చేశారని అనురాధ ఎద్దేవా చేశారు. రూ.700



కోట్ల ప్రజాధనంతో శ్మశానాల్లోని సమాధులపై కూడా జగన్ తన ఫొటోలు వేయించుకున్నారని విమర్శించారు. నేడు న్యాయస్థానం ఈ కేసులో చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇవ్వడంతో అంతిమంగా నిజమే గెలిచిందని, నిజానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మేకపోతు గాంభీర్యం వీడి సిగ్గుతో తలదించుకోవాలని హితవు పలికారు. ప్రజలు తిరస్కరించినా, కోర్టులు మొట్టికాయలు వేసినా వైసీపీ నేతల బుద్ధి మారలేదని, డీఎస్పీని అడ్డుకోవాలని చూసి కోర్టులో అక్షింతలు వేయించుకున్నారని విమర్శించారు. అనవసర రాద్ధాంతాలు మాని, ఇప్పటికైనా ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం నేర్చుకోవాలని ఆమె సూచించారు.

రైల్వేలో 560 పారామెడికల్ Posts

560 పోస్టులకు నోటిఫికేషన్

- దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో
- RRB షార్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది

ఎంపిక విధానం:
CBT, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టు

పే స్కేల్:
₹21,700 - ₹44,900 మధ్య

ముఖ్య తేదీలు:
ఈ నెల 15 నుండి అక్టోబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..

Website
https://www.rrbapply.gov.in/
వెబ్సైట్:
Apply Now

తెలంగాణ ప్రభుత్వం
DM&HO, ఖమ్మం జిల్లా

బస్తీదవాఖానా ఉద్యోగాలు

నోటిఫికేషన్ నం. 02/2026 | నేషనల్ హెల్త్ మిషన్

06 ఖాళీలు

| పోస్ట్ | ఖాళీలు | వేతనం |
|---|---|---|
| మెడికల్ ఆఫీసర్ | 03 | ₹52,000/నెల |
| నర్సింగ్ ఆఫీసర్ | 03 | ₹29,900/నెల |

విద్యార్హత
- మెడికల్ ఆఫీసర్: MBBS + తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్
- నర్సింగ్ ఆఫీసర్: GNM / B.Sc నర్సింగ్ / M.Sc నర్సింగ్ / GNMతో పోస్ట్-B.Sc నర్సింగ్ + తెలంగాణ స్టేట్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్

వయోపరిమితి
18–44 సంవత్సరాలు
SC/ST/BC/EWS: +5 సంవత్సరాలు
PwD: +10 సంవత్సరాలు

దరఖాస్తు ఫీజు
₹1,000/- — ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్

ముఖ్య తేదీలు
దరఖాస్తులు: 03-09-2026 నుండి 10-09-2026 వరకు
చివరి తేదీ: 10-09-2026 | సాయంత్రం 5:00 గంటల వరకు

ఎంపిక విధానం
- 90% అకడమిక్ మార్కులు + 10% వయస్సు
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్
- 2 వారాల ఇండక్షన్ శిక్షణ

ఉద్యోగ స్థలం
ఖమ్మం జిల్లా, తెలంగాణ

ఎలా దరఖాస్తు చేయాలి?
ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ విధానం

ఆన్‌లైన్: అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ద్వారా దరఖాస్తు చేయాలి.

ఆఫ్‌లైన్: దరఖాస్తును డౌన్‌లోడ్ చేసి, అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి స్వయంగా / రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ చిరునామాకు పంపాలి:
DM&HOకార్యాలయం, F1, IDOC కాంప్లెక్స్, VV పాలెం, ఖమ్మం

ముఖ్య గమనిక
- కాంట్రాక్ట్: 1 సంవత్సరం / వాస్తవ అవసరం ముగిసే వరకు
- ఈ పోస్టులు పూర్తిగా తాత్కాలికమైనవి; రెగ్యులర్ ప్రభుత్వ పోస్టులు కావు.

అధికారిక వెబ్‌సైట్: khammam.telangana.gov.in

## శుద్ధి చేయాల్సింది భారాస నేతల బుద్ధిని!

హైదరాబాద్: దొరతనం పోకడలను భరించడానికి రాష్ట్రం సిద్ధంగా లేదని, భారాస ఎమ్మెల్యేల తీరు సమాజానికి అవమానకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారాస నేతలు సభాపతిని, ఆయన తల్లిని దూషించారని, దానిపై దళితులు నిరసన తెలియజేస్తే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దారుణమన్నారు. శుద్ధి చేయాల్సింది భారాస నేతల బుద్ధిని అని స్పష్టంచేశారు. బుధవారం శాసనసభ ప్రారంభమైన తర్వాత భారాస నిరసనలు కొనసాగిస్తున్న సమయంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం జరిగిన చర్చలోనూ ప్రసంగించారు. ''భారాస ఎమ్మెల్యేల తీరు అభ్యంతరకరం. పదేళ్లు మంత్రులుగా చేసిన వారు స్పీకర్‌ను అగౌరవపరిచేలా వ్యవహరించడం సరికాదు. ఈ రాష్ట్రం ఏర్పడిందే ఆత్మగౌరవ పునాదులపై. ఫాంహౌస్ చుట్టూ శుద్ధీకరణ, స్పీకర్‌ను అవమానించిన ఘటనలపై రాష్ట్రం తలదించుకుంటోంది. భారాస ఫ్యూడల్ భావజాలంతో రాష్ట్రాన్ని పరిపాలించి, అధికారం కోల్పోయిన తరువాత ఆగడాలకు పాల్పడుతోంది. జరిగిన సంఘటనలపై పశ్చాత్తాపం చెబుతారనుకుంటే సభలోకి వచ్చిన వెంటనే స్పీకర్‌పై విరుచుకుపడే ప్రయత్నం చేశారు. మీ ఛాలెంజ్‌లు, బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరు. ఈ ప్రభుత్వం స్పీకర్‌కు అండగా ఉంటుంది. నియమావళిని, సభా గౌరవాన్ని కాపాడటంతోపాటు సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత. సభ్యులు పదేపదే వెల్‌లోకి వచ్చి సభాపతితో వాగ్వాదానికి దిగడం, ఆయన సూచనలను పట్టించుకోకపోవడం సరికాదు. మీకు న్యాయం కావాలని నినాదాలు చేస్తున్నారు. న్యాయం మీకు కాదు.. బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకు కావాలి. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయడం వారిని అవమానించడమే.



శుద్ధి చేయాల్సింది నేలను కాదు. భారాస నేతల ఆలోచన, బుద్ధిని శుద్ధి చేయాలి. మేం కేసీఆర్ చావును కోరుకోవడం లేదు. ఆయన నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలి. రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం'' అని భట్టి తెలిపారు.

* **కేసీఆర్‌ది తొలి నుంచి దళిత వ్యతిరేక ధోరణే: మంత్రులు వివేక్, వాకిటి శ్రీహరి, సీతక్క**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా అస్పృశ్యత విధానం నేటికీ కొనసాగుతుండటం బాధాకరమని మంత్రులు వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు నడిచారని రోడ్లను శుద్ధి చేయడం దారుణమన్నారు. శాసనసభలో బుధవారం మధ్యాహ్నం మంత్రులతోపాటు కాంగ్రెస్, సీపీఐ, మజ్లిస్ ఎమ్మెల్యేలు ఈ అంశంపై మాట్లాడారు. 'కేసీఆర్‌ది తొలి నుంచీ దళిత వ్యతిరేక ధోరణి. వారిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. తెలంగాణకు తొలి సీఎంగా దళితుడినే చేస్తానని చెప్పి.. అధికారంలోకి వచ్చాక మోసం చేశారు. దళితులు కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లారన్న కారణంతో భారాస నేతలు ఆ రోడ్డును శుద్ధి చేయడం చాలా బాధాకరం. ఈ ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలి' అని వివేక్ డిమాండ్ చేశారు. 'దళితులపై భాజపా, భారాసలు వ్యవహరిస్తున్న ధోరణులు ఒకేలా ఉన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెళ్లిన ప్రాంతాన్ని భాజపా నేతలు శుద్ధి చేస్తే.. తాజాగా కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లిన ప్రాంతాన్ని భారాస నేతలు శుద్ధి చేశారు. ముందుగా భారాస నేతల వక్రబుద్ధినే శుద్ధి చేయాలి. కేసీఆర్‌కు నష్టం జరగాలని కాంగ్రెస్ కోరుకోవట్లేదు. కేసీఆర్ ఆరోగ్యం దెబ్బతినాలని హరీశ్‌రావు పూజలు చేయిస్తున్నారని కవితే చెప్పారు' అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కవిత చేసిన వ్యాఖ్యల్ని స్పీకర్ అనుమతితో సభలో సైతం వినిపించారు. దళితులు నిరసన తెలిపిన ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లిన అంశాన్ని భాజపా ఎందుకు ఖండించలేదని మంత్రి సీతక్క ప్రశ్నించారు. దళితుల అంశంపై భాజపా, భారాస భావజాలం ఒకేలా ఉన్నాయని ఆక్షేపించారు. ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, గండ్ర సత్యనారాయణ, మదన్‌మోహన్‌రావు, నాయిని రాజేందర్‌రెడ్డి, నవీన్‌యాదవ్, బాలూనాయక్, మహ్మద్ ముబిన్ తదితరులు సైతం శుద్ధీకరణ ఘటనను ఖండించారు.

## బుల్లెట్ ట్రైన్ హబ్ భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు తొలి అడుగు పడింది. సమీకృత సమగ్ర రవాణా కేంద్రం (ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్) పేరుతో శంషాబాద్ విమానాశ్రయ సమీపంలోని బహదూర్‌గూడలో 796.28 ఎకరాల భూమిని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు సేకరించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరాబాద్‌ముంబయి, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై వయా అమరావతి



కారిడార్ల మధ్య బుల్లెట్ ట్రైన్ల రాకపోకలు, వాటి కార్యకలాపాలను బహదూర్‌గూడ నుంచి నిర్వహించేందుకు వీలుగా ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. బుల్లెట్ ట్రైన్ హబ్ విమానాశ్రయానికి సమీపంలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆరునెలల క్రితం నిర్ణయించారు. దానికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు శంషాబాద్‌తుక్కుగూడ ఔటర్ సర్వీస్ రోడ్‌కు సమీపంలోని బహదూర్‌గూడలో 750 ఎకరాల ప్రభుత్వ భూమిని, 46.28 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. శంషాబాద్ విమానాశ్రయ రన్‌వేకు కూతవేటు దూరంలో బహదూర్‌గూడలో సర్వే నంబరు 62, 28లలో 750 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. దాంతో అధికారులు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

# 'మీ మామ రాజకీయ సన్యాసం చేస్తేనే.. నువ్వు మళ్లీ పార్టీలోకి': మాయావతి

బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి.. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ఇటీవల పార్టీ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. పార్టీ ప్రయోజనాలను పరిరక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ఆమె చెప్పారు. అయితే, ఆకాశ్ చేసిన తప్పులను క్షమించి, మళ్లీ పార్టీలో పనిచేసే అవకాశం కల్పించాలనుకుంటున్నట్లు మాయావతి తాజాగా వెల్లడించారు. అయితే, అందుకు ఓ షరతు విధించారు. ఆకాశ్ ఆనంద్ మామ, మాజీ ఎంపీ అశోక్ సిద్ధార్థ్ రాజకీయ సన్యాసం తీసుకుంటేనే.. తిరిగి తన మేనల్లుడిని పార్టీలోకి ఆహ్వానిస్తానని స్పష్టం చేశారు. అలా జరిగితే బహుజన్ సమాజ్ పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతలు కూడా ఆకాశ్‌కు తిరిగి అప్పగిస్తానని మాయావతి పేర్కొన్నారు. అశోక్ సిద్ధార్థ్ పార్టీ లక్ష్యాల కన్నా తన వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆమె ఆరోపించారు. ఈ పర్యవసానాలను ఆయనతో పాటు ఆకాశ్ కూడా



భరించాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా తన కుటుంబాన్ని.. కుమార్తెఅల్లుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అశోక్ రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అప్పుడే తన మేనల్లుడికి బాధ్యతలు అప్పగించే విషయాన్ని పార్టీ పరిశీలిస్తుందని మాయావతి స్పష్టం చేశారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి గతంలో తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ప్రకటించారు. తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆకాశ్ ఇంకా పరిణతి సాధించలేదని అప్పట్లో పేర్కొన్నారు. మళ్లీ గతేడాది ఆయనను తన రాజకీయ వారసుడిగా.. పార్టీ జాతీయ సమన్వయకర్తగా ప్రకటించారు. పార్టీలో పూర్తి పరిణతితో పనిచేసేందుకు ఆకాశ్‌కు మళ్లీ అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల మరోసారి ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం మూడోసారి కూడా యూటర్న్ తీసుకొని ఆకాశ్‌కు మరో అవకాశం ఇవ్వనున్నట్లు మాయావతి పేర్కొనడం గమనార్హం.

## టీవీకే అధికార కూటమి కొత్త పేరు ఇదే..

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ పార్టీ టీవీకే నేతృత్వంలోని అధికార కూటమికి 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ ఫ్రంట్'గా నామకరణం చేశారు. టీవీకే మిత్రపక్షాలు బుధవారం చెన్నైలో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. భేటీ అనంతరం టీఎన్‌సీసీ చీఫ్ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. టీవీకే



అధ్యక్షుడు, సీఎం విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి ఏర్పాటైనట్లు వెల్లడించారు. ఈ కొత్త పేరు తమ కూటమి ఆశయాలు, అజెండాను స్పష్టంగా తెలియజేస్తోందని మాణికం ఠాగూర్ అన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఇందులో భాగమేనని తెలిపారు. తమ కూటమి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు. తమిళనాడులో కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్, వామపక్షాల మద్దతుతో టీవీకే సర్కారు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## స్కూల్ విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ గుడ్‌న్యూస్.. ₹500కే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు!

దేశంలోని పాఠశాల విద్యార్థులకు ప్రఖ్యాత ఐఐటీమద్రాస్ (IIT Madras) సువర్ణావకాశం కల్పిస్తోంది. ఎనిమిది వారాల పాటు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఒక్కో కోర్సుకు రూ.500 నామమాత్రపు రుసుంతో డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో పాటు ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ వంటి అధునాతన కోర్సులను బోధించనుంది. ఐఐటీమద్రాస్‌కు భాగస్వామిగా నమోదు చేసుకున్న పాఠశాలల్లో 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సంప్రదించడం ద్వారా ఈ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ నుంచి ప్రారంభం కానున్న ఈ కోర్సులకు ఐఐటీ మద్రాస్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి కలిగిన, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సర్టిఫికెట్ కోర్సులు అక్టోబర్ 5 నుంచి మొదలవుతాయి. ఐఐటీ మద్రాస్ 'స్కూల్ కనెక్ట్'(School Connect) కార్యక్రమంలో దేశం వెలుపల ఉన్న 60కి పైగా పాఠశాలలతో పాటు మొత్తం 4,900కి పైగా స్కూల్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇప్పటివరకు 1.75 లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. రాబోయే కొన్నేళ్లలో దీన్ని 25వేల పాఠశాలలకు విస్తరించడమే ఐఐటీ మద్రాస్ CODE (సెంటర్ ఫర్ అవుట్‌రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్) లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థులు తమ జీవితంలో ఎంతో కీలకమైన విద్యాపరమైన నిర్ణయాలు తీసుకొనే ముందు వివిధ రంగాలను అన్వేషించేందుకు, అర్థం చేసుకొనేందుకు ఒక అవకాశాన్ని కల్పించేందుకే 'స్కూల్ కనెక్ట్' రూపొందించినట్లు ఐఐటీ మద్రాస్ పేర్కొంది. అలాగే, పాఠశాల విద్యకు, ఉన్నత విద్యకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే దీని లక్ష్యమని తెలిపింది. ఈ ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులను సైతం




ఈ కోర్సులకు ఆహ్వానిస్తున్నందుకు తామెంతో సంతోషిస్తున్నట్లు తెలిపింది. ముందుగానే ఆయా రంగాలపై అవగాహన కల్పించడం వల్ల విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించి.. సరైన నిర్ణయాలు తీసుకోవడానికి దోహదపడుతుందని ఐఐటీ మద్రాస్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. స్కూల్ కనెక్టులో భాగంగా 17 రంగాలకు సంబంధించిన ముఖ్యమైన కోర్సులను ఐఐటీ మద్రాస్ అందిస్తోంది. వీటిలో డేటా సైన్స్ అండ్ ఏఐ, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, కెమికల్ ఇంజినీరింగ్, మాలిక్యులర్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, లా, ఎకనమిక్స్ అండ్ ఫైనాన్స్, హ్యూమానిటీస్, ఎకాలజీ, డిజిటల్ హ్యూమానిటీస్, గేమ్ టెక్నాలజీ, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఇంజినీరింగ్ బయోలాజికల్ సిస్టమ్స్ ఉన్నాయి. ఈ కోర్సులను ఐఐటీ మద్రాస్, ఇతర ప్రఖ్యాత విద్యా సంస్థల అధ్యాపకులు అభివృద్ధి చేసి అందిస్తారు. ప్రతి కోర్సు ఎనిమిది వారాల వ్యవధి ఉంటుంది. ఇందులో ముందుగా రికార్డ్ చేసిన స్పీచ్‌లు, లైవ్ సెషన్‌లు, అసైన్‌మెంట్‌లు, కంప్యూటర్ ఆధారిత అసెస్‌మెంట్‌లు ఉంటాయి. కోర్సు విజయవంతంగా పూర్తయిన తర్వాత ఈసర్టిఫికెట్‌లను అందిస్తారు.

## ఎంత ధైర్యం.. మేం చెప్పాక కూడా నోటీసులా: సుప్రీంకోర్టు ఆగ్రహం

కాక్రోచ్ జనతాపార్టీ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ''ఆ నోటీసులు ఎలా ఇస్తారు. దేశవ్యాప్తంగా ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు వద్దని ఇప్పటికే మా ఆదేశాల్లో స్పష్టంగా చెప్పాం. అయినా నోటీసులు ఇవ్వడానికి మేజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యం'' అని న్యాయస్థానం ప్రశ్నించింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో దిల్లీ సహా దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో విద్యార్థులపై నమోదైన



కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. కాగా.. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలో పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారంటూ గ్రేటర్ నోయిడా విద్యార్థికి సెప్టెంబర్ 4న నోటీసులు జారీ అయ్యాయి. తర్వాత రోజు అధికారులు ఆ నోటీసులు వెనక్కి తీసుకున్నారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జోక్యం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది బిశ్వజిత్ భట్టాచార్య కోరిన నేపథ్యంలో.. న్యాయస్థానం స్పందించింది.

## 5 రాష్ట్రాల ఎన్నికల వేళ.. భాజపాకు రూ.1,473 కోట్లు

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యధిక నిధులు పొందిన పార్టీల్లో భాజపా అగ్రస్థానంలో నిలిచింది. ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి శాసన సభలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భాజపాకు భారీగా నిధులు అందినట్లు ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్క భాజపా కేంద్ర కార్యాలయానికి రూ.1,473 కోట్ల మేర నిధులు రాగా.. కాంగ్రెస్ పార్టీకి కేంద్ర, రాష్ట్ర విభాగాల నుంచి వచ్చిన మొత్తం రూ.207కోట్లుగా ఉంది. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ సమగ్ర వ్యయ నివేదిక ఇదివరకే వెలువడింది. మార్చి 15నుంచి మే 6వరకు కొనసాగిన ఎన్నికల సమయంలో ఆ పార్టీ రూ. 207.17 కోట్ల ఆదాయాన్ని.. రూ.248.55 కోట్ల వ్యయాన్ని చూపించింది. దీనికి భిన్నంగా అదే సమయంలో భాజపా తన కేంద్ర కార్యాలయం నుంచే రూ. 1,472.8 కోట్లు వచ్చినట్లు నమోదు చేసింది. కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన ఆ పార్టీ వ్యయ నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. వాటితో కలిపితే ఆ పార్టీ మొత్తం ఆదాయం ఇంకా అధికంగానే ఉండే అవకాశముంది.




యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (UIIC)
यूनाइटेड इंडिया UNITED INDIA
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (స్కేల్-I) ఉద్యోగాలు
మొత్తం ఖాళీలు: 225

| పోస్ట్ | ఖాళీలు | విద్యార్హత |
|---|---|---|
| అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (స్కేల్-I) - జనరలిస్టులు | 200 | ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ / పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో 60% మార్కులు ఉండాలి. (SC/ST/PwBD అభ్యర్థులకు 55% మార్కులు) |
| అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (స్కేల్-I) - హిందీ ఆఫీసర్లు | 25 | నిర్దేశించిన హిందీ/ఇంగ్లీష్ సబ్జెక్ట్ కాంబినేషన్లతో మాస్టర్స్ డిగ్రీలో 60% మార్కులు ఉండాలి. (SC/ST/PwBD అభ్యర్థులకు 55% మార్కులు) |
| మొత్తం | 225 | — |

గమనిక: కంప్యూటర్లపై పని చేసే పరిజ్ఞానం తప్పనిసరి.

వయో పరిమితి
వయస్సు: 21 నుండి 30 సంవత్సరాలు
30 జూన్ 2026 నాటికి వయస్సు పరిగణించబడుతుంది.

జీతం
సుమారు నెల జీతం: ₹1,10,000
పే స్కేల్: ₹82,485 నుండి ₹1,56,745 వరకు

దరఖాస్తు ఫీజు
- సాధారణ అభ్యర్థులు: ₹1,000 + GST
- SC/ST/PwBD/UIIC ఉద్యోగులకు: ₹250 + GST

ముఖ్యమైన తేదీలు
- దరఖాస్తు ప్రారంభం: 08 సెప్టెంబర్ 2026
- దరఖాస్తు చివరి తేదీ: 28 సెప్టెంబర్ 2026
- ప్రిలిమ్స్ పరీక్ష: 22 అక్టోబర్ 2026*
- మెయిన్స్ పరీక్ష: 30 నవంబర్ 2026*

ఎంపిక విధానం
ప్రిలిమ్స్ → మెయిన్స్ + డిస్క్రిప్టివ్ టెస్ట్ → ఇంటర్వ్యూ

అధికారిక వెబ్‌సైట్
uiic.co.in



స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (SSC)
सत्यमेव जयते
కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) లెవల్ పరీక్ష 2026

పోస్టులు
LDC / JSA . డేటా ఎంట్రీ ఆపరేటర్ (DEO) . DEO గ్రేడ్ 'A'

ఖాళీలు: 2,536 (తాత్కాలికంగా)

అర్హత
12వ తరగతి ఉత్తీర్ణత / సమానమైన అర్హత
* నిర్దిష్ట విభాగాల్లో DEO/DEO గ్రేడ్ 'A' పోస్టులకు: 12వ తరగతిలో సైన్స్‌తో పాటు గణితం చదివి ఉండాలి.

వయో పరిమితి
18–27 సంవత్సరాలు, 01-08-2026 నాటికి
పుట్టిన తేదీ: 02–08–1999 నుండి 01–08–2008 వరకు
*ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుంది.

వేతన శ్రేణి
LDC/JSA: ₹19,900–63,200 (లెవల్-2)
DEO: ₹25,500–81,100 (లెవల్-4) / ₹29,200–92,300 (లెవల్-5)
DEO గ్రేడ్ 'A': ₹25,500–81,100 (లెవల్-4)

దరఖాస్తు రుసుము
₹100
మహిళలు / SC / ST / PwBD / అర్హత కలిగిన ESM: రుసుము మినహాయింపు

ముఖ్యమైన తేదీలు

| | |
|---|---|
| దరఖాస్తు: | 07 సెప్టెంబర్ – 07 అక్టోబర్ 2026 |
| చివరి తేదీ: | 07 అక్టోబర్ 2026, రాత్రి 11:00 గంటలు |
| రుసుము చెల్లింపు: | 08 అక్టోబర్ 2026, రాత్రి 11:00 గంటలు |
| దరఖాస్తు సవరణ: | 14 – 16 అక్టోబర్ 2026, రాత్రి 11:00 గంటలు |
| Tier-I & Tier-II: | తరువాత ప్రకటించబడుతుంది |

ఎంపిక ప్రక్రియ
Tier-I CBT → Tier-II CBT → స్కిల్/టైపింగ్ టెస్ట్ → డాక్యుమెంట్ వెరిఫికేషన్

అధికారిక వెబ్‌సైట్ ssc.gov.in

గమనిక: నోటిఫికేషన్, అర్హతలు, సిలబస్, పరీక్ష విధానం మొదలైన వివరాల కోసం దయచేసి అధికారిక వెబ్‌సైట్‌ను చూడండి.






బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (BECIL)
ప్రకటన నం. 556
సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వ సంస్థ; మినీ రత్న కంపెనీ.
41 కాంట్రాక్టు పోస్టులు

| పోస్టు | ఖాళీలు | అర్హత | వేతనం |
|---|---|---|---|
| టెక్నికల్ అసిస్టెంట్ ENT | 02 | స్పీచ్ & హియరింగ్‌లో B.Sc. + RCI రిజిస్ట్రేషన్; M.Sc. ఉంటే అదనపు అర్హత; క్లినికల్ హాస్పిటల్ అనుభవం | ₹40,710 |
| EMT టెక్నీషియన్ | 02 | EMT-Basic/Advanced సర్టిఫికేషన్ లేదా పేర్కొన్న ఆమోదిత సంస్థల నుండి Pre-Hospital Trauma Technician సర్టిఫికేషన్ | ₹26,208 |
| పేషెంట్ కేర్ మేనేజర్ (PCM) | 05 | లైఫ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ + హాస్పిటల్/హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో పూర్తి కాల PG అర్హత + PG తర్వాత 1 సంవత్సరం హాస్పిటల్ అనుభవం | ₹30,000 |
| ల్యాబ్ అటెండెంట్ | 05 | 12వ తరగతి (సైన్స్) ఉత్తీర్ణత + అర్హత అనంతరం 2 సంవత్సరాల ల్యాబ్ అనుభవం | ₹26,208 |
| డెంటల్ టెక్నీషియన్ | 02 | 12వ తరగతి/ఇంటర్మీడియట్ సైన్స్ + DCI గుర్తింపు పొందిన 2 సంవత్సరాల డిప్లొమా + 2 సంవత్సరాల సంబంధిత అనుభవం | ₹29,325 |
| ఫుడ్ బేరర్ | 05 | 10వ తరగతి ఉత్తీర్ణత + 1 సంవత్సరం సంబంధిత అనుభవం + ఫుడ్-హ్యాండ్లర్ శిక్షణ సర్టిఫికేట్ | ₹21,502 |
| OT టెక్నాలజిస్ట్ | 05 | B.Sc. Anesthesia & OT Technology లేదా B.Sc. OT/Anesthesia Technology | ₹33,580 |
| జూనియర్ ఫిజియోథెరపిస్ట్ | 05 | 10+2/ఇంటర్మీడియట్ (సైన్స్) + ఫిజియోథెరపీలో డిగ్రీ | ₹40,710 |
| ఫార్మసిస్ట్ | 05 | Pharmacy Act, 1948 ప్రకారం రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ + డిప్లొమా ఇన్ ఫార్మసీ; డిగ్రీ/అనుభవం ఉంటే అదనపు అర్హత | ₹28,444 |
| రేడియో గ్రాఫర్ | 05 | Radiographyలో B.Sc. (Hons.) లేదా 3 సంవత్సరాల B.Sc. in Radiography | ₹40,710 |

వయస్సు:
18–40 సంవత్సరాలు / పోస్టు ఆధారంగా వయోపరిమితులు; కొన్ని పోస్టులకు వేర్వేరు పరిమితులు లేదా వయోపరిమితి లేదు

దరఖాస్తు రుసుము:
SC/ST/PWD - లేదు | ఇతరులు - ₹295

ఉద్యోగ స్థలం:
సెంట్రల్ గవర్నమెంట్ హాస్పిటల్, ఢిల్లీ NCR

ఎంపిక విధానం:
షార్ట్‌లిస్టింగ్ + ఇంటర్వ్యూ / అసెస్‌మెంట్ / స్కిల్ టెస్ట్ - సంస్థ నిర్ణయం ప్రకారం

చివరి తేదీ:
21.09.2026 — సాయంత్రం 18:00 గంటలు

అధికారిక వెబ్‌సైట్: | www.becil.com




## ఐఫోన్ 18 ఫోన్లు వచ్చేశాయ్



అందరూ అంచనా వేసినట్లుగానే యాపిల్ తన తొలి ఫోల్డబుల్ (మడత పెట్టే) ఫోన్ ఐఫోన్ డ్యూయో సహా ఐఫోన్ 18 శ్రేణిని బుధవారం ప్రపంచానికి పరిచయం చేసింది. కాలిఫోర్నియాలోని యాపిల్ పార్క్‌లో జరిగిన 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' కార్యక్రమంలో సంస్థ కొత్త సీఈఓ జాన్ టెర్నస్ నూతన ఉత్పత్తుల వివరాలను వెల్లడించారు. రెండు రంగుల్లో (స్టార్ వైట్, నైట్ స్కై) లభ్యమయ్యే ఫోల్డబుల్ ఫోన్, మడత విప్పినపుడు అత్యంత పల్చటి ఐఫోన్‌గా మారుతుంది. ఇందుకు తగ్గట్లుగా ఐఓఎస్ 27ను రీడిజైన్ చేశారు. 7.6 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లే (మడత తీసినపుడు)లో రెండు హోమ్ స్క్రీన్ పేజెస్, మెయిల్, మెసేజెస్ వంటి కంటెంట్‌నూ అందజేస్తుంది. దీంతో రెండు యాప్‌లను పక్కపక్కన ఒకేసారి వినియోగించుకోవచ్చు. మడత పెట్టినపుడు (5.4 అంగుళాలు) బెడ్‌సైడ్ క్లాక్(విడ్జెట్స్, వెదర్, క్యాలెండర్, మ్యూజిక్)లానూ వాడుకోవచ్చు.

ఐఫోన్ 18 ప్రో: ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు భారత్‌లో 256జీబీ, 512 జీబీ, 1టీబీ, 2టీబీ స్టోరేజీల్లో లభ్యమవుతాయి. డీప్ బ్లాక్, సిల్వర్, గ్లేసియర్ బ్లూ, సరికొత్త బర్గుండీ రంగుల్లో వస్తున్నాయి.

ఫ్రీచర్లివీ: 6.3 అంగుళాల పరిమాణంలో వస్తున్న ఈ ఫోన్‌లో సరికొత్త ఏఐ ఆధారిత సిరి

**ఇమేజ్ ప్లేగ్రౌండ్ వంటి ఏఐ టూల్స్**

* ఏ20 ప్రో చిప్ నీ కొత్త సెవెన్ కోర్ జీపీయూ, సిక్స్ కోర్ సీపీయూ వల్ల మరింత ఎక్కువ సామర్థ్యం
* 36 గంటల వీడియో ప్లేబ్యాక్ నీ 15 నిమిషాల్లో 50% ఛార్జ్

**ఒక ఛార్జింగుతో 24 గంటల వినియోగం**

* 48 ఎంపీ ఫ్యూజన్ మెయిన్‌కెమేరాలో ఆస్ట్రోఫొటోగ్రఫీ, నైట్ మోడ్ మరింత మెరుగు
* 4కే రిసొల్యూషన్, డాల్బీ విజన్ హెచ్‌డీఆర్‌లో టైమ్ లాప్స్

**ప్రో కంట్రోల్స్**

యాపిల్ ఇంటెలిజెన్స్ వంటి ఫీచర్లున్నాయి.

* ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్: 6.9 అంగుళాల పరిమాణంలోని ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌లో, ఐఫోన్ 18 ప్రోలో ఉండే ఫీచర్లు మరింత విస్తృతంగా లభ్యం. ఒక ఛార్జింగుతో 30 గంటల వినియోగం, 45 గంటల పాటు వీడియో ప్లేబ్యాక్ వంటివి ఉన్నాయి.
* ఎయిర్‌పాడ్స్ 5: ఓపెన్ ఇయర్ డిజైన్‌తో వస్తోంది. అంతక్రితం ఎయిర్‌పాడ్స్‌తో పోలిస్తే బయటి శబ్దాల తగ్గింపు (నాయిస్ రిడక్షన్) మరో 50% మెరుగవుతుంది. లైవ్ ట్రాన్స్‌లేషన్, సిరి వంటి ఇతర ఇంటెలిజెంట్ ఫీచర్లను సైతం హ్యాండ్స్ ఫ్రీ మోడ్‌లో వాడుకోవచ్చు. కెమేరా రిమోట్, వాల్యూమ్ స్వైప్ వంటివీ ఉన్నాయి.

యాపిల్ వాచ్ సిరీస్ 12, యాపిల్ వాచ్ అల్ట్రా 4: ఏఐ ఆధారిత ఆడియో ఫీచర్లున్నాయి. లైవ్ రివైండ్ ఫీచరులో 15 సెకన్లకు ముందు సంభాషణ లభిస్తుంది. సరికొత్త హెల్త్ సెన్సర్ వ్యవస్థతో వచ్చాయి. మెరుగైన ఈసీజీ, ఆప్టికల్ సెన్సింగ్ ఉన్నాయి. ప్రతి 5 సెకన్లకు హృదయస్పందన నమోదవుతుంది. అంతక్రితంతో పోలిస్తే ఇది 60 రెట్లు ఎక్కువ. నిద్ర, రక్త డేటా, వాస్తవ వయసుతో ఆరోగ్య సంకేతాల పోలికను అందజేస్తుంది.

## ఏఐ కంపెనీలు మన జీవితాలతో ఆడుకుంటున్నాయ్



దిల్లీ: 'ఓపెన్‌ఏఐ సహా దిగ్గజ ఏఐ (కృత్రిమమేధ) కంపెనీలు మనుషుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. అవి బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ ఒక సూపర్‌ఇంటలిజెన్స్ అభివృద్ధి రేసులో పరుగులు తీస్తున్నాయ'ని జాకబ్ కోక్సన్ పేర్కొన్నారు. ఆంత్రోపిక్‌లో ఏఐ పరిశోధకుడిగా ఉన్న జాక్సన్ కంపెనీకి రాజీనామా సమర్పించిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సంస్థల్లో గత మూడేళ్లలో కోక్సన్ ప్రీ ట్రెయినింగ్ రీసెర్చ్ నిర్వహించారు. 'నేను ఇవాళ రాజీనామా చేశాను. ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్‌ల్లో మూడేళ్ల పాటు పనిచేశా. రెండు కంపెనీలూ బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు. మన జీవితాలను ఆడుకునే, స్వయంగా తమకు తాము మెరుగయ్యే సూపర్ ఇంటెలిజెన్స్ రేసులో అవి ఉన్నాయ'న్నారు. ఏఐ ల్యాబ్‌ల మధ్య ఉన్న పోటీ రేసు హద్దులు దాటిందన్నారు.

* ఏవైనా హ్యాక్ చేస్తాయ్..: 'దేనినైనా హ్యాక్‌చేసే సూపర్‌హ్యూమన్ వ్యవస్థల దిశగా సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాత్రికి రాత్రి ఏ రంగంలోనైనా ఇది విప్లవాన్ని తీసుకొస్తుంది. మన శక్తిని, వనరులను లాగేసుకుంటుంది. ఏ ఇతర మానవ చర్య కూడా తలపెట్టలేనంత ప్రమాదాన్ని ఏఐ తీసుకురాగలద'ని జాకబ్ సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. ఇటీవలి హగ్గింగ్ ఫేస్ హ్యాకింగ్ పరిణామాన్ని గుర్తు చేశారు. ఇటీవలే ఓపెన్‌ఏఐ ముఖ్య శాస్త్రవేత్త జాకుబ్ పకోచి సైతం ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతా ప్రమాణాలు ఏర్పాటయ్యే వరకు, సంస్థలు తమ మోడళ్ల వేగాన్ని స్వచ్ఛందంగా తగ్గించుకోవాలనే సూచించారు. ఆంత్రోపిక్‌లో ప్రస్తుతం అలైన్‌మెంట్ సైన్స్ లీడ్‌గా ఉన్న ఎవాన్ హబింగర్ మాట్లాడుతూ 'సూపర్‌ఇంటెలిజెన్స్ దిశగా వెళ్లే ఆలోచన కంపెనీ లేద'ని స్పష్టం చేశారు.

## అదానీ ఎయిర్‌పోర్ట్స్ @3



దిల్లీ: ప్రపంచంలోనే అత్యంత విలువైన 3 విమానాశ్రయాల నిర్వహణ సంస్థల్లో గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ (ఏఏహెచ్‌ఎల్) నిలిచింది. అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదార్ల నుంచి తాజాగా 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల) ఈక్విటీని సమీకరించేందుకు, పరిగణించిన సంస్థ విలువ ప్రకారం ఈ ఘనత ఏర్పడింది. ఈ లావాదేవీకి ముందు అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ విలువ 18 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.71 లక్షల కోట్లు)గా ఉంది. కొత్త మూలధనం సమకూరాక, సంస్థ విలువ 19 బి.డాలర్ల (రూ.1.80 లక్షల కోట్ల)కు చేరింది. దీంతో ప్రపంచంలోనే మూడో అత్యంత విలువైన విమానాశ్రయాల నిర్వహణ సంస్థగా నిలిచింది. తొలి రెండు స్థానాల్లో స్పెయిన్‌కు చెందిన ఏనా 46 బి.డా. (సుమారు రూ.4.37 లక్షల కోట్లు), ఎయిర్‌పోర్ట్స్ ఆఫ్ థాయ్‌లాండ్ 27 బి.డా. (సుమారు రూ.2.56 లక్షల కోట్లు) నిలిచాయి. ఈ రెండూ పబ్లిక్లీ ట్రేడెడ్ కంపెనీలు. అవి ఆయా దేశాల్లోని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో, ప్రైవేట్లీ హెల్డ్‌గా అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ ఉంది. అంటే అదానీ ఎయిర్‌పోర్ట్స్ స్టాక్‌మార్కెట్లలో నమోదు కాలేదు.

1 బి.డాలర్లతో: తాజాగా పెట్టిన పెట్టుబడులు టెమాసెక్, బ్లాక్‌రాక్ నిర్వహణలోని ఫండ్‌లు, ఆల్ఫావేవ్ గ్లోబల్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ నుంచి వచ్చాయి. వీటన్నింటికీ కలిపి లావాదేవీ పూర్తయ్యాక అదానీ ఎయిర్‌పోర్ట్స్‌లో 5.54% వాటా దక్కుతుంది.

## ఎన్ఎస్ఈ ఐపీఓ పరిమాణం తగ్గనుందా?




నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఐపీఓ పరిమాణం తగ్గే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఈ ఇష్యూలో తాజా షేర్ల జారీ ఏమీ లేదు. ప్రస్తుత వాటాదార్లు 'ఆఫర్ ఫర్ సేల్' (ఓఎఫ్ఎస్) పద్ధతిలో తమ వాటాల్లో కొంత విక్రయించాలని నిర్ణయించారు. ఇంతకుముందు అంచనా ప్రకారం ఎన్ఎస్ఈలో దాదాపు 6% వాటాను ఓఎఫ్ఎస్ పద్ధతిలో ప్రస్తుత వాటాదార్లు విక్రయించాల్సి ఉంది. వీరిలో కొంతమంది ఐపీఓలో తమ వాటాలు విక్రయించకూడదని అనుకుంటున్నారని.. అందువల్ల ఎన్ఎస్ఈలో ఓఎఫ్ఎస్ కింద వాటా విక్రయం గతంలో అనుకున్న 6% నుంచి 5.25.5 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా మొత్తం ఇష్యూ పరిమాణం గతంలో అంచనా వేసిన రూ.30,000 కోట్ల నుంచి రూ.25,00027,000 కోట్లకు తగ్గే అవకాశం ఉంది. ఈనెల 1822 తేదీల్లో ఎన్ఎస్ఈ ఇష్యూ ఉండొచ్చని, షేరుకు ధరల శ్రేణి రూ.1,7001,785గా నిర్ణయిస్తారని సమాచారం.

## ఈస్ట్‌కు భారీ ఆధిక్యం



చెన్నై: దులీప్ ట్రోఫీని ఈస్ట్ జోన్ చేజిక్కించుకోవడం లాంఛనమే. సౌత్ జోన్‌తో ఫైనల్లో ఆ జట్టు 372 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. మ్యాచ్‌లో గెలిచే అవకాశమున్నది ఆ జట్టుకు మాత్రమే. ఫైనల్ డ్రాగా ముగిసినా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఈస్ట్ ట్రోఫీని చేజిక్కించుకోవడం ఖాయం. 242/6తో నాలుగో రోజు, బుధవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్.. 336 పరుగులకు ఆలౌటైంది. 56 పరుగులతో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ తిలక్ వర్మ (99; 211 బంతుల్లో 9×4) త్రుటిలో శతకం కోల్పోయాడు. చామా మిలింద్ (43)తో ఏడో వికెట్‌కు తిలక్ 78 పరుగులు జోడించడంతో సౌత్ స్కోరు 300 దాటింది. చివరి 4 వికెట్లను ఆ జట్టు 18 పరుగుల తేడాలో కోల్పోయింది. సౌత్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఈస్ట్.. ఆట చివరికి 212/5తో నిలిచింది. 13 పరుగులకే ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (3), వైభవ్ సూర్యవంశీ (8) ఔటైపోయినా.. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (80; 98 బంతుల్లో 9×4, 3×6) మరోసారి చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టును తిరుగులేని స్థితిలో నిలిపాడు. అతను శిఖర్ మోహన్ (52)తో మూడో వికెట్‌కు 126 పరుగులు జోడించాడు. కుమార్ కుశాగ్ర (34 బ్యాటింగ్), కౌనైన్ ఖురేషి (26 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈస్ట్ ప్రస్తుతం 584 పరుగుల ఆధిక్యంలో ఉంది. చివరి రోజు ఇదే స్కోరు వద్ద ఈస్ట్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి సౌత్‌ను బ్యాటింగ్‌కు దింపే అవకాశముంది. దాదాపు 600 లక్ష్యాన్ని ఒక్క రోజులో ఛేదించడం అసాధ్యం కాబట్టి దులీప్ ట్రోఫీ ఈస్ట్ చేజిక్కినట్లే.

* **సంక్షిప్త స్కోర్లు...**
* **ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్: 708**

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 336 (తిలక్ వర్మ 99, దేవ్‌దత్ పడిక్కల్ 62, చామా మిలింద్ 43; ముకేశ్ కుమార్ 3/62, మహ్మద్ షమి 2/42, శిఖర్ మోహన్ 2/67, కౌనైన్ ఖురేషి 2/99); ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్: 212/5 (ఇషాన్ 80, శిఖర్ మోహన్ 52; కుమార్ కుశాగ్ర 34 బ్యాటింగ్; సిరాజ్ 1/17, నిధీశ్ 1/14, షేక్ రషీద్ 1/20)




## ఘనంగా ముగించారు

* **శీతల్, హర్విందర్-భావనలకు స్వర్ణాలు**
* **ప్రపంచ పారా ఆర్చరీ సిరీస్**



అహ్మదాబాద్: భారత్‌లో తొలిసారిగా జరిగిన అంతర్జాతీయ పారా ఆర్చరీ ఈవెంట్‌ను ఆతిథ్య దేశం ఘనంగా ముగించింది. ప్రపంచ పారా ఆర్చరీ సిరీస్ స్టేజ్ 3లో చివరి రోజైన బుధవారం భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలతో పాటు నాలుగు కాంస్యాలు చేరాయి. కాంపౌండ్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్ శీతల్ దేవి.. తన ఆధిపత్యాన్ని చాటుతూ పసిడి నెగ్గింది. షూటాఫ్‌కు దారి తీసిన ఫైనల్లో శీతల్.. కజకిస్థాన్ ఆర్చర్ ఐజాదా సీడన్‌పై విజయం సాధించింది. స్కోర్లు 144144తో సమం కావడంతో షూటాఫ్ అనివార్యమైంది. అందులో శీతల్ పది పాయింట్లు సాధించగా.. ఐజాదా 9 పాయింట్లే రాబట్టడంతో స్వర్ణం భారత ఆర్చర్ సొంతమైంది. పారాలింపిక్స్ ఛాంపియన్ హర్విందర్ సింగ్, భావన జోడీ రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. ఫైనల్లో ఈ ద్వయం 60తో చైనా క్రీడాకారులు లియాంగ్, జియాలను ఓడించింది. శీతల్.. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్లో కాంస్యం గెలిచింది. భావన రికర్వ్ కాంస్య పోరులో భారత్‌కే చెందిన రాజశ్రీ రాథోడ్‌పై విజయం సాధించింది. ఇదే విభాగంలో సరిత కూడా కంచు పతకం గెలిచింది. తోమన్ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం నెగ్గాడు.

## అల్కరాస్‌కు షాక్





యుఎస్ ఓపెన్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) కథ ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ సినర్ గైర్హాజరీలో పురుషుల సింగిల్స్‌లో తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అతడు.. క్వార్టర్స్‌లోనే నిష్క్రమించాడు. అయిదు సెట్ల పాటు అభిమానులను అలరించిన మారథాన్ సమరంలో ఎనిమిదో సీడ్ షెల్టన్ 67 (57), 61, 63, 16, 76 (107)తో అల్కరాస్‌పై విజయం సాధించాడు. ''నేను అలసిపోయా. ఇది యుద్ధం. కార్లోస్ ఈ ఆటలో గొప్ప ఛాంపియన్. కెరీర్‌లో నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన మ్యాచ్ ఇది అనడంలో సందేహం లేదు'' అని మ్యాచ్ అనంతరం షెల్టన్ వ్యాఖ్యానించాడు. ఈ ఓటమితో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అల్కరాస్ 18 మ్యాచ్‌ల విజయపరంపరకు తెరపడింది. ''మ్యాచ్ చాలా హోరాహోరీగా సాగింది. చివరికి విజయం సాధించలేకపోయినందుకు నిరాశగా ఉంది. కానీ నేను పోరాడిన తీరు పట్ల గర్వంగా ఉన్నా. బాగా అలసిపోయినా కష్టపడ్డా'' అని అల్కరాస్ అన్నాడు. షెల్టన్ గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ చేరడం ఇది మూడోసారి. ఈ క్వార్టర్స్‌లో అతడు 7 ఏస్‌లు, 34 విన్నర్లు కొట్టాడు. 5 సార్లు అల్కరాస్ సర్వీసును బ్రేక్ చేశాడు. మరోవైపు 3 ఏస్‌లు, 38 విన్నర్లు కొట్టిన అల్కరాస్.. 7 డబుల్ ఫాల్ట్‌లు, 53 అనవసర తప్పిదాలతో దెబ్బతిన్నాడు. షెల్టన్ 35 అనవసర తప్పిదాలే చేశాడు.

హోరాహోరీగా..: అల్కరాస్, షెల్టన్ మధ్య క్వార్టర్‌ఫైనల్ ఆద్యంతం రసవత్తరంగా సాగింది. తొలి సెట్లో కీలకమైన 11వ గేమ్‌లో షెల్టన్ సర్వీసు కోల్పోయాడు. కానీ వెంటనే బ్రేక్ సాధించి, సెట్‌ను టైబ్రేక్‌లోకి తీసుకెళ్లాడు. నువ్వా నేనా అన్నట్లు సాగిన టైబ్రేక్‌లో అల్కరాస్ పైచేయి సాధించాడు. కానీ బలంగా పుంజుకున్న షెల్టన్ తర్వాతి రెండు సెట్లలో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 3, 5, 7 గేముల్లో బ్రేక్‌లతో రెండో సెట్‌ను సొంతం చేసుకున్న షెల్టన్.. మూడో సెట్లోనూ అదే జోరును ప్రదర్శించాడు. రెండో గేమ్‌లోనే బ్రేక్ సాధించిన షెల్టన్, ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ ఆ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. కానీ అల్కరాస్ అంత తేలికగా వదల్లేదు. అతడు జోరందుకున్నాడు. 2, 6 గేముల్లో బ్రేక్‌లతో అలవోకగా నాలుగో సెట్‌ను గెలుచుకుని స్కోరు సమం చేశాడు. మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు తీసుకెళ్లాడు. అయిదో సెట్ హోరాహోరీగా సాగింది. ఇద్దరూ సర్వీసులు నిలబెట్టుకుంటూ పోవడంతో టైబ్రేక్ తప్పలేదు. అది కూడా రసవత్తరంగా సాగింది. చివరికి షెల్టనే పైచేయి సాధించాడు. అతడు 146 మైళ్ల వేగంతో ఓ ఏస్‌ను సంధించి, మ్యాచ్‌ను ముగించాడు. షెల్టన్ మ్యాచ్ ఆద్యంతం పదునైన సర్వీసులతో అదరగొట్టాడు. సెమీఫైనల్లో అతడు అమెరికాకే చెందిన తియోఫోతో తలపడతాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో తియోఫో 57, 36, 75, 63, 76 (106)తో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా)పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో తియోఫో 10 ఏస్‌లు, 50 విన్నర్లు కొట్టాడు. 8 సార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. మిచెల్సన్ 21 ఏస్‌లు కొట్టినప్పటికీ.. 9 డబుల్ ఫాల్ట్‌లు, 61 అనవసర తప్పిదాలతో దెబ్బతిన్నాడు.

పెగులా ముందంజ: మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్‌ఫైనల్లో ఆమె 36, 64, 63తో నవారో (అమెరికా)పై విజయం సాధించింది. తొలి సెట్ కోల్పోయాక పెగులా బలంగా పుంజుకుంది. మ్యాచ్‌లో ఆమె 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. రిబకినా (కజకిస్థాన్) కూడా తుది నాలుగులో చోటు దక్కించుకుంది. క్వార్టర్స్‌లో ఆమె 36, 61, 64తో జెంగ్ (చైనా)ను ఓడించింది.

## సెమీస్‌లో భారత్



మోఖి (చైనా): జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నమెంట్లో భారత పురుషుల జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కెప్టెన్ అన్మోల్ ఎక్కా ఆరు గోల్స్ కొట్టడంతో బుధవారం భారత్ 150తో చైనీస్ తైపీని చిత్తుగా ఓడించింది. వరుస దాడులతో తైపీ డిఫెన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన భారత్.. విరామానికే 60తో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ అదే జోరును ప్రదర్శించి, గోల్స్ వర్షం కురిపించింది. అన్మోల్ (25వ, 29వ, 32వ, 33వ, 45వ, 51వ నిమిషాల్లో) తన అన్ని గోల్స్ కూడా పెనాల్టీ కార్నర్‌ల ద్వారానే సాధించాడు. ఆర్యన్ (17వ, 52వ, 53వ) మూడు గోల్స్ కొట్టగా.. హర్‌పాల్ (48వ, 53వ) రెండు గోల్స్ సాధించాడు. ప్రభ్‌దీప్ (18వ), గుర్‌సేవక్ (22వ), అర్జున్ సంతోష్ (28వ), అజీత్ యాదవ్ (35వ) తలో గోల్ చేశారు. నాలుగు మ్యాచ్‌ల నుంచి 10 పాయింట్లు సాధించిన భారత్, గ్రూప్‌ఏను అగ్రస్థానంతో ముగించింది. ఆ జట్టు మూడు మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. మొత్తం 9 పాయింట్లు సాధించిన కొరియా, గ్రూప్‌లో రెండో స్థానంతో సెమీస్‌కు అర్హత సాధించింది. ఆ జట్టు తన చివరి మ్యాచ్‌లో 32తో జపాన్‌ను ఓడించింది. క్వార్టర్స్‌లో భారత్ × పాక్: జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నమెంట్లో భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం క్వార్టర్‌ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. బుధవారం చైనాతో ఎలైట్ పూల్ ఆఖరి మ్యాచ్‌ను భారత్ 00తో డ్రా



## టాలీవుడ్‌లోకి కన్నడ భామ ఏక్తా

శాండల్‌వుడ్‌లో నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఏక్తా రాథోడ్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. విశ్వక్‌సేన్ హీరోగా సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లెగసీ'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుంది. ఈ సినిమాలో కేకే మేనన్, రావు రమేశ్, సచిన్ ఖేడేకర్, మురళీమోహన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబరులో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. బెంగళూరుకు చెందిన ఏక్తా రాథోడ్ మోడలింగ్ నుంచి నటనలోకి వచ్చింది. 'మాస్టర్‌పీస్', 'సిలికాన్ సిటీ' వంటి కన్నడ చిత్రాల్లో నటించింది. 'సిలికాన్ సిటీ'తో గుర్తింపు తెచ్చుకున్నంది. నటనలో మరింత మెరుగుపడేందుకు న్యూయార్క్‌లో మెథడ్ యాక్టింగ్ శిక్షణ తీసుకుంది. రాజకీయ నేపథ్యంతో తెరకెక్కుతున్న 'లెగసీ'లో కీలక పాత్రలో కనిపించనున్న ఏక్తా.. తెలుగు తెరపై ఎలాంటి గుర్తింపు తెచ్చు కుంటుందో చూడాల్సిందే.

## వింత కోరిక

మాళవిక మోహనన్ విభిన్న పాత్రపై తన కోరికను బయటపెట్టింది. భవిష్యత్‌లో ఎలాంటి పాత్రలో నటించాలని ఉందని ఓ అభిమాని అడగ్గా.. 'గ్యాంగ్‌స్టర్‌గా నటించాలనుంది' అని బదులిచ్చింది. సోషల్ మీడియా వేదికగా నిర్వహించిన 'ఆస్క్ విత్ మాళవిక' కార్యక్రమంలో అభిమానులతో ముచ్చటించింది. తాను, హీరో కార్తి ఇద్దరం ఫుడ్ లవర్స్‌మేనని, స్నాక్స్ అంటే ఇద్దరికీ చాలా ఇష్టమని చెప్పింది. ప్రస్తుతం మాళవిక.. కార్తి హీరోగా నటించిన 'సర్దార్–2'లో కీలక పాత్రలో కనిపించనుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మాళవిక తమిళంలో పాకెట్ నావెల్ చిత్రంలో నటిస్తోంది. తెలుగులోనూ రవిజేత మూవీలోనూ నటించనున్నట్లుగా వార్తలు వచ్చాయి. మేకర్స్ అఫీషియల్స్‌గా ప్రకటించాల్సి ఉంది.






## ప్రపంచం అసలు రూపం బయటపడుతుంది!

- కయదు లోహర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

హీరోయిన్ కయదు లోహర్ నటిస్తున్న తాజా చిత్రం 'మంజనత్తి'. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో భాగం కావడం తనకు ఎంతో గౌరవంగా, ఆశీర్వాదంగా భావిస్తున్నానంటూ కయదు లోహర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఒక వ్యక్తి ఎలా ఉండాలి, ఎలా ప్రవర్తించాలి అంటూ సమాజం విధించే అంచనాలు క్రమంగా హద్దులుగా మారతాయని పేర్కొంది. ఒక నిబంధన తర్వాత మరో నిబంధన, మరో చూపు, మరో హద్దు ఎదురవుతూనే ఉంటాయని.. చివరకు అడగకూడదనుకున్న ప్రశ్నను ఆమె అడిగినప్పుడు ప్రపంచం అసలు రూపం బయటపడుతుందని ఆసక్తికరంగా వ్యాఖ్యానించారు. ఇలాంటి లోతైన అంశాన్ని ప్రశ్నించే సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చింది.

## ఓటీటీలోకి 'ఇరుముడి'

మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ సక్సెస్ అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ మూవీ.. పోటీగా పలు చిత్రాలు ఉన్నప్పటికీ థియేటర్లలో డీసెంట్‌గా రన్ అవుతోంది. ఇదిలా ఉంటే.. 'ఇరుముడి' ఓటీటీ రిలీజ్‌పై ఆసక్తికరమైన బజ్ వినిపిస్తోంది. సెప్టెంబర్ 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు సహా పలు భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో బేబీ నక్షత్ర, ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, రమేశ్ ఇందిర, స్వాసిక విజయ్ కీలక పాత్రల్లో నటించారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. థియేటర్లలో ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న ఎమోషనల్ కంటెంట్.. ఓటీటీలోనూ సినిమాకు ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## 'శ్రీమతి'గా నివేదా థామస్

టాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ నివేదా థామస్ కొంతకాలం తర్వాత కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'శ్రీమతి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో నివేదా హోమ్‌మేకర్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఓ సాధారణ గృహిణి జీవితంలో చోటు చేసుకునే సంఘటనలు, భావోద్వేగాల చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. '35 చిన్న కథ కాదు' తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన నివేదా.. ఇప్పుడు 'శ్రీమతి'తో రీఎంట్రీ ఇస్తోంది. 'స్కైలాబ్' ఫేమ్ విశ్వక్ ఖండేరావు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.